దిల్‌సే ఇండియా!

పన్నెండేళ్ల నిరీక్షణ ఫలించింది. చాంపియన్స్ ట్రోఫీని మూడోసారి భారత్ ముద్దాడింది. న్యూజిలాండ్‌తో నువ్వానేనా అన్నట్లు సాగిన ఫైనల్ ఫైట్‌లో టీమ్ ఇండియా ఘన విజయం సాధించింది. దీంతో క్రికెట్ అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. అప్పటి వరకూ టీవీలకు అతుక్కుపోయి ఉత్కంఠగా చూసినవారు ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చి కేరింతలు కొట్టారు. కొందరు బాణసంచా కాల్చి ఆనందోత్సాహాల్లో మునిగితేలారు. పలువురు జాతీయ జెండాలు పట్టుకొని జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కార్పొరేషన్



ఒంగోలులో టీవీ చూస్తూ విజయానందం

ఒంగోలులో జాతీయ జెండాతో యువత కేరింతలు

పృథులగిరీశుడికి ధ్వజారోహణం



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ధ్వజారోహణ కార్యక్రమం ఆదివారం శాస్త్రోక్తంగా జరిగింది. ముందుగా లక్ష్మీ నరసింహ స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు చిహ్నంగా ధ్వజారోహణం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించారు.

- మర్రిపూడి, ఆంధ్రజ్యోతి

నాటుసారాపై సమరభేరి

- నవోదయం 2.0
- తయారీదారులపై పీడీ చట్టం ప్రయోగం
- జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు ప్రారంభం

7

వేలానికి వేళాయె!

- నేటి నుంచి దక్షిణాదిలో పొగాకు కొనుగోళ్లు
- తొలి విడత నాలుగు కేంద్రాల్లో ప్రారంభం
- సాగు విస్తీర్ణం పెరిగినా తగ్గుతున్న దిగుబడి
- భారీగా ఉత్పత్తి ఖర్చులు
- ధరల పెంపు కోరుతున్న రైతులు

ఒంగోలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు వేలం కేంద్రాల్లో సోమవారం నుంచి ప్రస్తుత సీజన్ కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలోని 16వేలం కేంద్రాల్లో మూడు విడతలుగా వేలాన్ని చేపట్టాలని పొగాకు బోర్డు నిర్ణయించింది. అందులో తొలి విడత సోమవారం దక్షిణాదిలోని ఒంగోలు-1, పొదిలి, కొండపి, కందుకూరు-1 కేంద్రాల్లో కొనుగోళ్లకు శ్రీకారం పలుకుతున్నారు. రెండో విడత ఈనెల 19న దక్షిణాదిలో మిగిలిన ఏడు కేంద్రాలైన ఒంగోలు-2, వెల్లంపల్లి, టంగుటూరు, కనిగిరి, కందుకూరు-2, కలిగిరి, డీసీపల్లిలో ప్రారంభించనున్నారు. మూడో విడత ఈనెల 24 నుంచి ఉత్తరాది (ఎస్‌ఎల్‌ఎస్) కేంద్రాలలో వేలం మొదలుకానుంది.

గత సీజన్‌లో ఆశాజనకంగా ధరలు

దక్షిణాదిలో 2023-24 సీజన్‌కు పొగాకు బోర్డు సుమారు 58,929 హెక్టార్లలో సాగుకు, 88.69 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. రైతులు 72,350 హెక్టార్లలో పంట సాగు చేసి 154.50 మిలియన్ కిలోలు పండించారు. మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉండటంతో అంత పంట ఉత్పత్తి జరిగినా మంచి ధరలే లభించాయి. సగటున కిలోకు రూ. 269.10 మేర దక్కింది. దీంతో బ్యారన్‌కు సుమారు రూ.5 లక్షల వరకు అధిక శాతం మంది రైతులు ఆదాయం పొందారు. ఈసారి (2023-24) పొగాకుబోర్డు అనుమతి ఇచ్చిన దాని కన్నా అధికంగా దాదాపు 24వేల హెక్టార్లలో పంట సాగైంది. సుమారు 6.50 మిలియన్ కిలోలు మాత్రమే అదనంగా ఉత్పత్తి కానుంది. గత ఏడాది సగటున హెక్టార్‌కు 20 క్వింటాళ్ల ఉత్పత్తి జరగ్గా, ఈ ఏడాది 15 క్వింటాళ్లకు మించి వచ్చే అవకాశం లేదు.

కిలోకు రూ.275-రూ.285 ఇవ్వాలని..

గతంలో బ్యారన్‌కు రూ.10లక్షల నుంచి రూ.12 లక్షల వరకు పెట్టుబడి ఖర్చులు కాగా, ఈ ఏడాది రూ.15 లక్షల నుంచి రూ.16 లక్షల వరకూ వెచ్చించాల్సి వచ్చింది. వాతావరణ పరిస్థితుల మూలంగా దిగుబడి 25 శాతం తగ్గుతున్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో కిలోకు రూ.275 నుంచి రూ. 285 వరకు ధర లభిస్తేనే పెట్టుబడి ఖర్చులు వస్తాయని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కర్ణాటక మార్కెట్‌లో గరిష్ఠ ధరలు కిలోకు రూ.370 వరకూ పలుకుతున్నాయి. ఈనేపథ్యంలో ఇక్కడి మార్కెట్‌లో వ్యాపారులు ఆరంభం నుంచే మంచి ధరలు ఇచ్చి వేగంగా పంట కొనుగోలు చేసేలా బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పొగాకు ఉత్పత్తి వివరాలు..

దక్షిణాది (ప్రకాశం, నెల్లూరు జిల్లాలు)లో
మొత్తం వేలం కేంద్రాలు : 11
రిజిస్టర్ చేసుకున్న రైతులు : 30,109
లైసెన్సులు పొందిన బ్యారన్లు : 24,575
బోర్డు అనుమతించిన సాగు : 63,997 హెక్టార్లు
అనుమతించిన పంట ఉత్పత్తి : 105 మిలియన్ కిలోలు
సాగైన పంట విస్తీర్ణం : 87,988 హెక్టార్లు
పంట ఉత్పత్తి అంచనా : 161 మిలియన్ కిలోలు



పొగాకు చెక్కులను సిద్ధం చేస్తున్న రైతులు (ఫైల్)

పల్లెకు సంపద

వినియోగంలోకి చెత్త నుంచి సంపద కేంద్రాలు

- టీడీపీ గత పాలనలో భారీగా నిర్మాణం
- వైసీపీ హయాంలో నిరుపయోగం
- పునఃప్రారంభంపై కూటమి ప్రభుత్వం దృష్టి
- పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి
- అటు ఆదాయం.. ఇటు పారిశుధ్యం మెరుగు

గ్రామాల్లో ప్రజలకు విస్తృత అవగాహన

గ్రామ పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి చేకూర్చడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఒకవైపు ఆదాయం పెంపు, మరోవైపు పల్లెల్లో పారిశుధ్యం మెరుగు కోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. అందులో భాగంగా గత వైసీపీ పాలనలో నిరుపయోగంగా మారిన చెత్త నుంచి సంపద కేంద్రాలను పునఃప్రారంభించాలని నిర్ణయించింది. వాటిని వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. అందుకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ఆదేశాలు ఇచ్చింది. దీంతో అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా గత టీడీపీ హయాన నిర్మించిన కేంద్రాల్లో ఎన్ని వినియోగంలో ఉన్నాయి, ఎన్ని నిరుపయోగంగా మారాయి అన్న వివరాలు సేకరించారు. పూర్తిస్థాయిలో వాటిని పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన వాటికి మరమ్మతులు చేయిస్తున్నారు.




నాగులుప్పలపాడులో సిద్ధం చేసిన చెత్త సంపద కేంద్రం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో (2014-2019) గ్రామ పంచాయతీలపై ప్రత్యేక శ్రద్ధ చూపింది. ఆదాయ వనరులను పెంచేందుకు ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధులతో చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్మాణాన్ని చేపట్టింది. విభజిత జిల్లాలో 726 గ్రామపంచాయతీలు ఉండగా అప్పట్లో 602 చోట్ల చెత్తసంపద కేంద్రాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 328 కేంద్రాలను పూర్తి చేసింది. 245 పాక్షికంగా ఉన్నాయి. స్థలాలు లేక, వివిధ కారణాలతో 29 ప్రారంభించలేదు. పూర్తిచేసిన కేంద్రాల్లో కొన్నింటిని అప్పట్లోనే వినియోగంలోకి తెచ్చారు. మరికొన్ని ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఈ సమయంలో రాష్ట్రంలో ఎన్నికలు వచ్చాయి.

వైసీపీ పాలనలో పట్టించుకోని వైనం

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెత్త నుంచి సంపద కేంద్రాలు మరుగునపడ్డాయి. కొన్ని మందుబాబులు, జూదరులకు అడ్డాగా మారాయి. కూటమి అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇటు పారిశుధ్యం మెరుగు, ఇటు ఆదాయం పెంపు లక్ష్యంగా వీటిని వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఇప్పటికే షెడ్ల నిర్మాణం పూర్తయి వినియోగించని వాటి పునరుద్ధరణతోపాటు కొత్తవి ఏర్పాటు చేయనున్నారు.



గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన

గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లను (చెత్త సేకరించే కార్మికులు) ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ చెత్తను సేకరించడం ద్వారా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగవుతుంది. వీటిపై పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలతో డీపీవో జి.వెంకటనాయుడు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు ఇవ్వడంతోపాటు చెత్త వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తున్నారు. మరోవైపు కేంద్రాలకు తీసుకువచ్చే చెత్త నుంచి సంపద ఎలా సృష్టించాలన్న దానిపై కార్మికులకు కూడా అవగాహన కల్పిస్తున్నారు. వీటిని త్వరలోనే వినియోగంలోకి తీసుకురానున్నారు.

కేంద్రాలన్నింటినీ వినియోగంలోకి తెస్తాం



జిల్లాలోని చెత్త నుంచి సంపద కేంద్రాలన్నింటినీ వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకున్నాం. అందుకోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. వీటి ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉండటంతోపాటు పంచాయతీలకు ఆదాయం కూడా లభిస్తుంది. గృహ యజమానులు చెత్తను డ్రైనేజీ కాలువల్లో వేయకుండా ఉండటం వల్ల దోమల ఉత్పత్తి కూడా పెరగదు.

- జి.వెంకటనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి

సీఎం చంద్రబాబు జిల్లా పర్యటన సందర్భంగా శనివారం అనుసరించిన సరికొత్త విధానం యావత్తు టీడీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. అధికారిక కార్యక్రమానికి ఆయన పరిమితం కాకుండా పార్టీ కార్యకర్తలతో భేటీ కావడం, బూత్‌స్థాయి నుంచి నాయకులను పేరుపేరునా అభినందించడంతో కేడర్‌లో ఉత్సాహం నెలకొంది. దీంతోపాటు ఆయా స్థాయిల్లోని పార్టీ బాధ్యుల కృషిని, ఫలితాలను ప్రశంసించడం తెలుగు తమ్ముళ్లలో ఉత్తేజాన్ని నింపింది. పార్టీ పదవుల్లో మహిళలకు సగం కేటాయించబోతున్నట్లు ప్రకటించటమే కాక నామినేటెడ్ పోస్టులను కిందిస్థాయిలో పార్టీ బాధ్యతలు చూసిన వారికే ఇస్తామని చెప్పడంపై అందరిలోనూ హర్షం వ్యక్తమవుతోంది. - ఆంధ్రజ్యోతి, ఒంగోలు

తెలుగు తమ్ముళ్లలో జోష్

ఉత్తేజం నింపిన చంద్రబాబు

- బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలకు కితాబు
- గత ఎన్నికల్లో మంచి మెజారిటీ వచ్చిన ప్రాంతాల బాధ్యులకు అభినందనలు
- అధినేత సరికొత్త విధానంపై టీడీపీ కేడర్‌లో ఆసక్తికర చర్చ

10 మంది పేర్లు చెప్పి ప్రశంసలు

సీఎం చంద్రబాబు మార్కాపురం పర్యటనలో.. గత ఎన్నికల్లో టీడీపీకి మంచి మెజారిటీ వచ్చిన క్లస్టర్లు, బూత్‌ల వివరాలను వెల్లడించారు. పది మందికి పైగా క్లస్టర్ ఇన్‌చార్జిలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. గత ఎన్నికల్లో మార్కాపురం మునిసిపాలిటీలో ఒక్క పోలింగ్ బూత్ మినహా అన్నింటిలో టీడీపీకే ఆధిక్యత వచ్చింది. అందులో 63వ బూత్ నుంచి 81వ బూత్ వరకు ఉన్న క్లస్టర్లలో 4,254 ఓట్ల ఆధిక్యత రావడాన్ని ఆయన సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఆ క్లస్టర్ ఇన్‌చార్జి తాళ్లపల్లి సత్యనారాయణను ప్రత్యేకంగా అభినందించారు.

క్లస్టర్ల వారీ మెజారిటీ ప్రకటన

నియోజకవర్గంలో క్లస్టర్ల వారి మొదటి స్థానంలో సత్యనారాయణ నిలిచారని చంద్రబాబు తెలిపారు. రెండో స్థానంలో తర్లుబాడు మండలానికి చెందిన క్లస్టర్ ఇన్‌చార్జి కందుల కాశిరెడ్డి నిలిచారని ప్రకటించారు. ఆయన ప్రాతినిధ్యం వహించిన 19 నుంచి 42 వరకూ ఉన్న బూత్‌లలో వచ్చిన ఆధిక్యాన్ని వివరించారు. 3వ స్థానంలో మార్కాపురం పట్టణంలోని 24వ బూత్ నుంచి 42వ బూత్ వరకు 2,300 ఓట్ల ఆధిక్యం రావడాన్ని ప్రస్తావించారు. ఆ క్లస్టర్ ఇన్‌చార్జి వక్కలగడ్డ మల్లికార్జునను అందరికీ పరిచయం చేసి అభినందించారు. నాల్గోస్థానంలో నిలిచిన మరో క్లస్టర్ ఇన్‌చార్జి కొప్పుల శ్రీనివాసులును ఆయన సమావేశంలో పరిచయం చేశారు. అలా నియోజకవర్గం మొత్తంమీద దాదాపు 10 మంది క్లస్టర్ ఇన్‌చార్జిలను సమావేశంలో పరిచయం చేసి వారి పరిధిలో టీడీపీకి వచ్చిన మెజారిటీని వివరించారు. వరుస క్రమంలో తొలి పది స్థానాల ఇన్‌చార్జిల పేర్లు చదివి వినిపించారు.

కార్యకర్తల్లో ఆనందం

గతంలో సీఎంగా చంద్రబాబు జిల్లాకు వచ్చినప్పుడు అధికారిక సమావేశానికే పరిమితమయ్యేవారు. కేవలం ఎమ్మెల్యే, ఆస్థాయి ప్రజాప్రతినిధులతోనే మాట్లాడే వారు. ఈ పర్యాయం ప్రత్యేకంగా కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం, కిందిస్థాయిలో కష్టపడి పనిచేసిన నాయకులను పేరుపేరునా ప్రస్తావించి అందరితో అభినందించేలా చేయడం శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. అలాంటి వారిని ప్రోత్సహించాలని ఎమ్మెల్యేకు సూచించడం ఆకట్టుకుంది. పార్టీ పదవుల్లో సగం మహిళలకు కేటాయిస్తామని సీఎం ప్రకటించడంపై మహిళా కార్యకర్తల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



శనివారం నాడు మార్కాపురంలో కార్యకర్తలతో భేటీలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

పేదలకు అండగా సీఎం సహాయనిధి

● మంత్రి స్వామి



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధుల ద్వారా ఎందరో ప్రాణాలు నిలబెట్టగలిగామని సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. కొండపి నియోజవకర్గంలో పలువురు బాధితులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. వైద్యం, విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

పేదల పక్షపాతి రంగా..

వంగవీటి రంగా పేదల పక్షపాతి అని, పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలచిపోయాడని మంత్రి స్వామి అన్నారు. జయవరంలో వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో మంత్రి మాట్లాడుతూ టీడీపీ పాలనలో కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి కాపు యువతకు రుణాలిచ్చామని, అయితే 5ఏళ్ల జగన్ పాలనలో కార్పొరేషన్ నిర్వీర్యం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా పాలిటెక్నిక్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న మేయర్ సుజాత

ఒంగోలు విద్య, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ 43వ వార్షికోత్సవ, ఉద్యోగ విజయోత్సవ కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో తమ కళాశాలలో పాలిటెక్నిక్ విద్యార్థులందరూ ఉద్యోగాలకు ఎంపికై నూరుశాతం ప్లేస్‌మెంట్ సాధించారని తెలిపారు. చివరి సంవత్సరం విద్యార్థులు 69 మందికి ఉద్యోగ నియామక పత్రాలను ముఖ్యఅతిథి మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్ ఈదర వెంకటసురేష్‌బాబు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తమ సబ్జెక్టుల్లో సాంకేతిక, నైపుణ్యాలను పెంపొందించుకొని తద్వారా దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు. అనంతరం క్రీడా పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మేయర్ సుజాతను సత్కరించారు. కార్యక్రమంలో కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ మస్తానయ్య, ఒంగోలు కళాశాల హెచ్‌డీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగులు అందజేత



గొడుగులను అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో చిరువ్యాపారాలు చేసుకొనే మహిళలకు గొడుగులను పంపిణీ చేశారు. నగరంలో పలు కూడళ్లలో వ్యాపారం చేసుకునే మహిళలకు క్లబ్ ఫౌండర్ కూరపాటి రమేష్ ఈ గొడుగులను అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఈదర వెంకటేష్, కార్యదర్శి పార్థసారథి, కోశాధికారి స్వామి, క్లబ్ ప్రతినిధులు తమ్మన ఆంజనేయులు, రాంబాబు, గోపీ, కిషోర్, విజయ్, శ్రీనివాస్, రవి, శంకరరావు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరం ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయం వద్ద నూతన కార్యవర్గ సభ్యులు

పొన్నలూరు, మార్చి9 (ఆంధ్రజ్యోతి): చారిత్రక నేపథ్యం ఉన్న శ్రీ గంగా సర్వ మంగళాంబ సమేత సంగమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తమ వంతు పాటు పడతామని బ్రాహ్మణ అన్నదాన సమాజం అధ్యక్షుడు ముదివర్తి వేంకట చలపతిరావు అన్నారు. ఆదివారం ఆలయం ఆవరణలో బ్రాహ్మణ సమాజ సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదాన సమాజం నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మారెళ్ల క్రిష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా బద్దిపూడి ఆదినారాయణ, రామచంద్రుని మల్లికార్జునరావు, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా సింగరాజు ఉషారాణి, ఉపాధ్యక్షురాలిగా హిమ కామాక్షిలను ఎన్నుకున్నారు. మరో 20 మందితో కలిపి కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు.

ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన



ఆర్ఎం వెంకట్రావుతో మాట్లాడుతున్న నాయకులు

టంగుటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను రీజనల్ మేనేజర్ కె.వెంకట్రావుతో కలిసి టంగుటూరు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం పరిశీలించారు. పగటిపూట కూడా ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు బస్టాండ్‌కు రావని, రాత్రి 10 గంటలు దాటితే బస్సులు రావడం లేదని టీడీపీ నాయకులు తెలిపారు. పగలు, రాత్రి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు తిరిగేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, ఆర్ఎంకు వివరించారు.

బాలకృష్ణప్రసాద్ మృతికి పలువురి సంతాపం

ఒంగోలు కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసులు, టీటీడీ పూర్వ ఆస్థాన గాయకులు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ మృతికి నగరానికి చెందిన పలువురు గాయకులు ఆదివారం సంతాపాన్ని ప్రకటించారు. బాలకృష్ణప్రసాద్ నగరంలో పలు పర్యాయాలు సంగీత విభావరి నిర్వహించారు. ఆయన మృతి సంగీత రంగానికి తీవ్ర లోటని అన్నమాచార్య సంగీత, సాహిత్య సేవా సమితి అధ్యక్షులు ఐ.మురళీకృష్ణ, ప్రరసం అధ్యక్షులు పొన్నూరి వేంకట శ్రీనివాసులు పేర్కొన్నారు. అలాగే ప్రముఖ గాయని పి.శ్రావ్యరెడ్డి, గాయకులు మాగంటి శ్రీనివాసమూర్తి, శ్రీగిరి శ్రీవేంకటేశ్వర దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆలూరు సుశీలాదేవి, సీవీ.రామకృష్ణారావు, లక్ష్మీకుమారి, శ్రీనివాసచరణ్ రాజీవ్, ఆలూరు జైశంకర్, ఆస్థాన విద్వాంసులు వీవీఎన్.వినోద్‌కుమార్, లలిత కళా అకాడమీ అధ్యక్షుడు సంతవేలూరి కోటేశ్వరరావు తమ సంతాపం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి : సీపీఎం

కొండపి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం మిట్టపాలెం గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామాల్లో కనీస వసతులైన డ్రైనేజీ వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దళిత వాడల్లో సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కేజీ మస్తాన్, బి.రఘురామ్, కంకణాల రమాదేవి పాల్గొన్నారు.

పట్టించుకోండి సారూ...!

● సీసీ రోడ్‌పై పొంచి ఉన్న ప్రమాదం



సీసీ రహదారిపై ఏర్పడిన రంధ్రం

చీమకుర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నిత్యం రాకపోకలు సాగించే రహదారిపై పెద్ద రంధ్రం ఏర్పడటంతో ప్రమాదం పొంచి ఉంది. చీమకుర్తి పట్టణంలోని బ్రహ్మంగారిమఠం పక్కన ఉన్న సీసీరహదారిపై ఈ పరిస్థితి నెలకొంది. రోడ్డుకు, మురుగుకాలువకు మధ్య అనుసంధానంగా ఉన్న నాపరాళ్లు తొలగిపోవటంతో పెద్ద రంధ్రం ఏర్పడి రాత్రివేళ వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన రామాంజనేయులు

● ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్



రామాంజనేయులును సన్మానిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(రూరల్), మార్చి9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన ఆదర్శనీయుడు చుంచు రామాంజనేయులు అని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని ఎన్‌జీరంగా భవన్‌లో రామాంజనేయులు ఉద్యోగ విరమణ సత్కార సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ రామాంజనేయులు తన 37 సంవత్సరాల ఉపాధ్యాయ సర్వీసులో ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని అభినందించారు. అంతేగాకుండా ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. రామాంజనేయులుతోపాటు ఉలిచి గ్రామంతో తనకు మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. యూటీఎఫ్ రాష్ట్ర నేత కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ రామాంజనేయులు విద్యా, సమాజసేవకులుగా ఎంతో కృషి చేశారన్నారు. విశ్రాంత జీవితాన్ని సమాజసేవకు వినియోగించాలని కోరారు. అనంతరం రామాంజనేయులు దంపతులను శాలువ, పూలదండలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఈవో కిరణ్‌కుమార్, రంగా భవన్ కార్యదర్శి చుంచు శేషయ్య, డాక్టర్ చుంచు చలమయ్య, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.వీరాంజనేయులు, ఏపీటీఎఫ్ నాయకుడు ఐ.విజయసారథి, ఎస్.చినస్వామి, ఉలిచి శారదానికేతన్ కరస్పాండెంట్ డి.కోటేశ్వరరావు, కమ్మవారి సేవాసంఘం అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, ఎంఈవో పి.కిషోర్‌బాబు, మండవ సుబ్బారావు పాల్గొన్నారు.

సీవీఎన్ రీడింగ్ రూం ప్రెసిడెంట్‌గా గురునాథరావు

వైస్ ప్రెసిడెంట్‌గా నితిన్‌రాజ్‌రెడ్డి

ప్రశాంతంగా ఎన్నికలు

ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే దామచర్ల



పోలింగ్ సందర్భంగా క్లబ్ వద్ద ఓటర్ల కోలాహలం



ప్రెసిడెంట్ గురునాథరావు

ఒంగోలు కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూం, క్లబ్‌కు ఆదివారం నూతన కార్యవర్గ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల అధికారి చిల్లర వెంకట సుబ్బారావు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. క్లబ్‌లో మొత్తం 970 మంది ఓటర్లు ఉండగా 848 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సైతం క్లబ్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక సాయంత్రం 5 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అయ్యింది. ఆంధ్రకేసరి ప్రకాశం ప్యానెల్ తరపున ప్రెసిడెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన ఈదుపల్లి గురునాథరావు అఖండ విజయాన్ని సాధించారు. అదే ప్యానెల్ నుంచి వైస్ ప్రెసిడెంట్‌గా పోటీ చేసిన ఆర్.నితిన్‌రాజ్‌రెడ్డి, కార్యదర్శి పదవికి పోటీ చేసిన కోడూరి రాధాకృష్ణలు విజయం సాధించారు. కాగా జాయింట్ సెక్రటరీగా తోట సాయి నవీన్, కోశాధికారిగా ఆరిగ వీరప్రతాప్‌లు విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

206 మంది శ్రీహర్షిణి విద్యార్థులకు ఉద్యోగాలు

● అభినందించిన కళాశాల చైర్మన్ రవికుమార్



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో ఆదివారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 206 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. చెన్నైకు చెందిన సిఏట్ కంపెనీకి 116 మంది విద్యార్థులు ఎంపిక కాగా వీరి సంవత్సర వేతనం రూ.2.64 లక్షలు, చెన్నైకి చెందిన వ్యాబ్‌కో కంపెనీకి 84 మంది ఎంపిక కాగా వీరి వేతనం రూ.2.16 లక్షలు, ఒంగోలుకు చెందిన చోళాస్ కంపెనీకి ఆరుగురు విద్యార్థులు ఎంపిక కాగా వీరి సంవత్సర వేతనం రూ.3 లక్షలు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కేవలం డిగ్రీ మాత్రమే కాకుండా క్యాంపస్ ప్లేస్‌మెంట్‌ను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేవలం డిగ్రీ మాత్రమే కాకుండా ప్రతి విద్యార్థికి కాంపిటీషన్ ఎగ్జామ్స్ దృష్టిలో ఉంచుకొని క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు కావాల్సిన అర్థమెటిక్, రీజనింగ్, సాఫ్ట్ స్కిల్ ఉచితంగా నేర్పిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపిక విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ఏవో యాంకర్ శ్రీనివాసరావు, క్యాంపస్ ఇన్‌చార్జి ధిరీష్ తదితరులు పాల్గొన్నారు.

మన్నం సుబ్బారావుకు ఘన నివాళి



కుట్టుమిషన్లు, గ్రైండర్లను అందజేస్తున్న జడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ, నిర్వాహకులు

చీమకుర్తి, మార్చి9(ఆంధ్రజ్యోతి) : చీమ కుర్తిలోని ఎస్‌కేఆర్ బధిరుల ఆశ్రమ పాఠశాల ఆవరణలో మన్నం సుబ్బారావు 22వ వర్ధంతిని ఆదివారం డాక్టర్ బి.జవహర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరై సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన్నం సుబ్బారావు చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత రెండు దశాబ్దాలకు పైగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆయన కుమారులు మన్నం శ్రీధర్‌బాబు, హరికృష్ణ, రామకృష్ణలను ప్రశంసించారు. అనంతరం పేద మహిళలకు కుట్టుమిషన్లు, గ్రైండర్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు రూ.27వేలు విలువ చేసే మంచాలను ప్రిన్సిపాల్ ఆంజనేయరెడ్డికి అందించారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, పమిడి వెంకటేశ్వర్లు, గోపురపు చంద్ర, రామసాని సూర్యచంద్రరావు, మస్తాన్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

12న విజయవాడలో మహాధర్నా

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచడంతో పాటు వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న విజయవాడలో చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఉపాధి కూలీలకు పనిదినాలు 200రోజులకు పెంచాలన్నారు. కార్యక్రమలో కేజీ.మస్తాన్, కంకణాల వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు, ఉబ్బా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

మద్దిపాడు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అన్నారు. వెల్లంపల్లిలో ఆదివారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఉబ్బా ఆదిలక్ష్మి, ఉబ్బా వెంకటేశ్వర్లు, వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు.


మహిళా సమాఖ్య కమిటీ ఏకగ్రీవం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో ఆదివారం జిల్లా గౌరవాధ్యక్షురాలు ఎస్.రావమ్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.విజయ, కె.అనంతలక్ష్మి ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగింది. ఒంగోలు నగర సమాఖ్య కన్వీనర్‌గా మన్నేపల్లి ప్రమీల, కో కన్వీనర్లుగా మల్లేశ్వరి, విజయభారతి, చౌటూరి పోలమ్మ, మరో 16మంది సభ్యులను ఎన్నుకున్నారు. అంతకు ముందు జరిగిన సభలో వారు మాట్లాడుతూ నగరంలో ఇళ్ల స్థలాల సాధన కోసం ముందుండి పోరాడాలన్నారు. నూతన కమిటీ సభ్యులను సీపీఐ నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి శ్రీరామ శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

మహిళలకు అండగా కూటమి ప్రభుత్వం

సంతనూతలపాడు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు పేర్కొన్నారు. ఆదివారం సంతనూతలపాడులో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల కృషిని మార్కాపురం సభలో సీఎం చంద్రబాబు కొనియాడారు. గత ప్రభుత్వంలో మహిళల అభ్యున్నతికి విఘాతం కలిగిందని, నేడు కూటమి ప్రభుత్వం రాకతో మహిళల్లో అభివృద్ధి చెందాలనే తపన పెరిగిందని హరిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు ఎస్.మాధవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా గురుబాబు



నియామకపత్రం అందుకుంటున్న గురుబాబు

మద్దిపాడు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మద్దిపాడు మండల అధ్యక్షుడిగా కొణిజేటి గురుబాబు నియమితులయ్యారు. ఆదివారం మద్దిపాడులో జరిగిన సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పాలపర్తి విజేష్‌రాజు, గురుబాబుకు నియామకపత్రాన్ని అందజేశారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పులిపాటి రాఘవులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు తుమ్మల సుబ్బారావు, నట్టే సుబ్బారావు, ఎద్దు శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతుల పట్ల ఉదారంగా వ్యవహరించాలి

● ఈడీ శ్రీధర్‌బాబు



శ్రీధర్‌బాబు దంపతులను సత్కరిస్తున్న రైతు ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతుల పట్ల వ్యాపారులు, బోర్డు అధికారులు ఉదారంగా వ్యవరించాలని టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ఈడీ శ్రీధర్‌బాబును ఆదివారం ఎస్‌బీఎస్, ఎస్‌ఎల్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌జీవీఎస్ కన్వెన్షన్ హాలులో సన్మాన కార్యక్రమాన్ని బోర్డు సెక్రటరీ దివి వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తాను పనిచేసిన కాలంలో రైతులు గిట్టుబాటు ధరలు కల్పించేలా కృషి చేశానని తెలిపారు. రైతులు, అధికారుల సహకారం వల్లే తాను పనిచేయగలిగానని, ఈ పరిస్థితులు ఎప్పుడూ ఉండాలని కోరారు. అంతకు ముందు గుర్రబండిపై శ్రీధర్‌బాబు దంపతులను ఊరేగించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఎం లక్ష్మణరావు, బోర్డు వైస్ చైర్మన్ బోడపాటి బ్రహ్మయ్య, వరప్రసాద్, ఐటీసీ ప్రతినిధులు శివకుమార్, ప్రవీణ్‌కుమార్, జీపీఐ ప్రతినిధి ప్రభాకర్, రైతు ప్రతినిధులు వడ్డెళ్ళ వరప్రసాద్, అబ్బూరి శేషగిరి, కొండారెడ్డి, పోతుల నరసింహారావు, భాస్కర్, శ్రీకాంత్, యర్రంనేని శేషయ్య, ఆళ్ళ సుబ్బారావు, గురువారెడ్డి, రమణయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

30నుంచి వసంత నవరాత్రులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీతారామ పురం లోని శ్రీసీతారామ స్వామి దేవస్థానంలో ఈనెల 30నుంచి వచ్చే నెల 6వతేదీ వరకు జరగనున్న శ్రీరామ నవమి పండుగ వసంత నవరాత్రుల ఉత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆవిష్కరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దేవాలయ సేవా సమితి నాయకులు మాట్లాడుతూ ఈనెల 30వతేదీన ఉగాది నుంచి వచ్చే నెల 6వతేదీ శ్రీరామ నవమి వరకు ఈ వేడుకలు జరుగుతాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. కళ్యాణ మహోత్సవానికి కుటుంబ సమేతంగా రావాలని కోరారు. కార్యక్రమంలో సేవాసమితి ప్రధానకార్యదర్శి మద్దులూరి శ్రీనివాసులు, అధ్యక్షుడు మొగిలి ఆనందరావు, ప్రతినిధులు గుర్రం వెంకట్రావు, తోట రవినాయుడు, విప్పగుంట రామాంజనేయులు, దేవగుడి శ్రీను, కాపారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు

కొండపి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కొండపి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు సోమవారం నుంచి ప్రారంభం అవుతాయని పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. తొలిరోజు మర్రిపూడి మండలం జువ్విగుంట గ్రామానికి చెందిన 18 నాణ్యమైన బేళ్ల విక్రయానికి రైతులు సిద్ధమవుతున్నారు. ఉదయం 9 గంటలకు వేలం కేంద్రంలో ప్రత్యేక పూజలు చేసి కొనుగోలు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. గడచిన ఏడాది కొండపి పొగాకు వేలం కేంద్రంలో దాదాపు 17 మిలియన్ కేజీలకుపైగా పొగాకు అమ్మకాలు జరిగాయి. బ్రైట్ రకానికి సరాసరి ధర రూ.329, మీడియం గ్రేడ్‌కు సరాసరి ధర దాదాపు రూ.311, లోగ్రేడ్ రకానికి రూ.226 రైతులకు లభించింది. బ్రైట్, మీడియం, లోగ్రేడ్‌లకు సరాసరిన కేజీకి రూ.280 ఇవ్వనిదే గిట్టుబాటు కాదని రైతులు అంటున్నారు.

జంగమ సంక్షేమ సంఘం అడ్‌హక్ కమిటీ ఎన్నిక

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : జంగమ సంక్షేమ సంఘం ఒంగోలు నగర అడ్‌హక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు మనుసూరి కోటేశ్వరరావు అధ్యక్షతన సంఘ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అడహక్ కమిటీ సభ్యులుగా మాదాల మల్లికార్జునరావు, నాగండ్ల సుబ్రహ్మణ్యం, దోగిపర్తి సుబ్బారావులను ఎన్నుకున్నారు. అనంతరం జంగమ కుల ఆరామక్షేత్ర అభివృద్ధిపై సమావేశంలో చర్చించారు.

రైల్వే స్థలాల్లోని నివాసితులకు పట్టాలు ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం విజయనగర కాలనీ సమీపంలో గత 40 ఏళ్ళ నుంచి రైల్వే స్థలాల్లో నివాసం ఉంటున్న కుటుంబాలకు పట్టాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా మజ్దూర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖలీఫాతుల్లా బాషా కోరారు. ఆదివారం స్థానిక ఫకీర్ బజారులో నివాసం ఉంటున్న కుటుంబాలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరుతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి షేక్ సిద్దాంబీ, కాలనీ అధ్యక్షుడు సయ్యద్‌మజుకర్ తదితరులు పాల్గొన్నారు.

జయవరంలో జూదరుల అరెస్ట్

టంగుటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జయవరం గ్రామ శివారులో జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.37,940 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఆక్రిడ్జ్ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలను అందుకుంటున్న విద్యార్థులు

నాగులుప్పలపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఎయిమ్స్ ఒలంపియాడ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి టాలెంట్ సెర్చ్ పరీక్షలలో నాగులుప్పలపాడులోని ఆక్రిడ్జ్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ తోకల బాలకృష్ణ, ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు తెలిపారు. హనుమలోహిత్ జాతీయస్థాయిలో 2, రోషిణి 4వ ర్యాంక్, పి.ఉదయ్ రాష్ట్ర స్థాయిలో 2, షేక్ దిల్వార్‌జానీ 7, సౌమ్యశ్రీ జోనల్ స్థాయిలో 1వ ర్యాంక్‌లు సాధించారు. ఈ సందర్భంగా ఆక్రిడ్జ్ విద్యార్థులను ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతీ ఆడిటోరియంలో ఎయిమ్స్ ఒలంపియాడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌లు కలీమ్‌ఖాన్, కడియాల ప్రభాకర్ ప్రశంసాపత్రాలను అందించారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

సీనియారిటీ జాబితాలో తప్పులను సవరించాలి

ఒంగోలు విద్య, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): హిందీ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాలోని తప్పులను సవరించాలని హిందీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పీఎం.ఖాన్ కోరారు. ఆదివారం ఈమేరకు పలు అభ్యంతరాలు తెలుపుతూ స్థానిక డీఈవో కార్యాలయంలో అభ్యంతరాల లేఖను అందజేశారు. ప్రస్తుత సీనియారిటీ జాబితా 2019 ప్రమోషన్ లిస్టుకు అనుగుణంగా ఉండాలని, నాడు ప్రమోషన్ పొందిన తెలుగు, హిందీ, వ్యాయామ ఉపాధ్యాయుల సీనియారిటీని 2019నవంబరు 1నుంచి పరిగణించాలని కోరారు. అంతర్ జిల్లా బదిలీల్లో ఇక్కడకు వచ్చిన సీనియారిటీని వారు ఈ జిల్లాలో చేరిన తేదీ నుంచి పరిగణలోకి తీసుకోవాలని, 2019 కంటే ముందు ప్రమోషన్ పొందిన వారి జాబితా కూడా మెరిట్ కమ్ రోస్టర్ పద్ధతిలో ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి భాస్కరరావు, కందుకూరు డివిజన్ అధ్యక్షుడు మస్తాన్‌వలి, షేక్ ఉజ్మాబాను, టి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ రచయిత పి.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా స్థానిక ఈమనిపాలెంలోని స్త్రీవిముక్తి సంఘటన జిల్లా కమిటీ నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. మహిళలను బానిసలుగా మార్చేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు జన సాహితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ.కృష్ణయ్య మాట్లాడుతూ అందాల ప్రదర్శనలు, పోటీలు సౌందర్య ఉత్పత్తులకు మార్కెటింగ్ వ్యూహం మాత్రమేనని, సామ్రాజ్య వాదుల వ్యూహంలో చిక్కి మహిళలు మానసిక వత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు టి.తిరుమల మాట్లాడుతూ విద్యార్థులు, చిన్న పిల్లలను సోషల్ మీడియాకు బందీలుగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి పెట్టుబడిదారులను పాలకులు ప్రోత్సహిస్తున్నందువల్లనే ప్రజల సమస్యలు పెరిగిపోతున్నాయని విమర్శించారు. జిల్లా కార్యదర్శి శాంతకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమలో డి.రేణుక, సుజాత తదితరులు పాల్గొన్నారు.


పీవోడబ్ల్యూ నూతన కార్యవర్గం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆదివారం ఒంగోలులో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా ఎం.లక్ష్మి, ప్రధానకార్యదర్శిగా బి.పద్మ, ఉపాధ్యక్షులుగా ఎన్.విష్ణు, ఆర్.గంగాభవానీ, రమాసుందరి, పి.రమణి, జానకి, సహాయ కార్యదర్శులుగా పి.పద్మ, మణి, ఎం.కల్పన, ఎస్.భారతి, కోశాధికారిగా వై.భారతి, మరో 15 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. అనంతరం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఎం.లక్ష్మి అధ్యక్షత వహించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 17నుంచి 24వ తేదీ వరకు ధర్నాలు నిర్వహించాలని తీర్మానించారు.

బధిరులకు అన్ని విధాలా సహకారం

ఒంగోలు కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా బధిరుల సంఘం జనరల్ బాడీ సమావేశం, ఎన్నికలు ఆదివారం ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై సూర్యశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ బధిరులకు తనవంతు సహాయం అందజేస్తానని చెప్పారు. తమ ట్రస్ట్ ద్వారా అండగా ఉంటామని ఛైర్మన్ సయ్యద్ షహనాజ్, సెక్రటరీ సర్దార్ బాషా అన్నారు. కార్యక్రమంలో బధిరుల సంఘం ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ రాజేంద్ర, మారెళ్ల సుబ్బారావు, జనసేవ శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

తిరునాళ్లు.. కోల్పోతున్న ఆనవాళ్లు



శింగరకొండ తిరునాళ్లలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసే ప్రాంతం ఇదే

శింగరకొండ ప్రాంతంలో ఒకప్పుడు చిట్టడవి.. పంట చేలు
ప్రస్తుతం శరవేగంగా ఇంటి స్థలాలు, ప్లాట్లుగా మార్పు
ఇప్పటికే కుంచించుకుపోయిన విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసే స్థలం
భవిష్యత్‌లో ఆంజనేయస్వామి వార్షికోత్సవం నిర్వహణకు తిప్పలే

అద్దంకి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రముఖ పుణ్య క్షేత్రం.. ఈ ప్రాంత వాసులకేకాదు, దేశ విదేశాల్లో ఉన్న వారికి కూడా శింగరకొండ అంజన్న అంటే ఓ నమ్మకం.. ఓ శక్తి.. ఓ ధైర్యం. ఆంజనేయస్వామిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకునేందుకు బారులుదీరతారు. అయితే ఏటా స్వామి వార్షికోత్సవం రోజున నిర్వహించే తిరునాళ్లకు సైతం ఎంతో ప్రత్యేకత ఉంది. అక్కడున్న సువిశాల ప్రదేశంలో విద్యుత్ ప్రభలు, వివిధ రకాల దుకాణాల ఏర్పాటు, లక్షలాది మంది భక్తుల సందడి స్వామి వైభవాన్ని చాటిచెప్పేది. రాన్రాను తిరునాళ్ల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తే అవకాశం లేకపోలేదు. అందుకు ఈ ప్రాంతం గతం.. ప్రస్తుతం.. భవిష్యత్ ఊహించుకుంటే తిరునాళ్ల నిర్వహణ కష్టమేనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అందుకు కారణాలేంటంటే...

శింగరకొండ ప్రాంతం శతాబ్ద కాలం కిందట చిట్టడవిని తలపిస్తూ ఉండేది. అక్కడ రాత్రి సమయంలో ఎవరూ ఉండే వారు కాదు. 70 ఏళ్ల కిందట శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్షిక తిరునాళ్లను ప్రారంభించారు. అప్పటి నుంచే ఏటా తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తారు. సమీప గ్రామాల ప్రజలు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తుంటారు. తిరునాళ్ల వేసవి కాలంలో కాబట్టి పంట పొలాలు ఖాళీగా ఉండడంతో విద్యుత్ ప్రభల ఏర్పాటుకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు.



పదేళ్ల నుంచి రియల్‌కు డిమాండ్

దశాబ్ద కాలం నుంచి ఆ ప్రాంతంలో రియల్‌వ్యాపారం ఊపందుకుంది. పంట పొలాలు క్రమక్రమంగా వెంచర్లగా మార్చారు. అదే సమయంలో అపార్ట్‌మెంట్‌లు సైతం ఏర్పడ్డాయి. దీంతో ఏటికేడు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసే విస్తీర్ణం తగ్గుతూ వస్తుంది. అద్దంకి పట్టణం కూడా శింగరకొండ రోడ్డులోకి విస్తరిస్తుండడంతో ఈ ప్రాంతంలో స్థలాలకు మంచి డిమాండ్ వస్తుంది. అదే సమయంలో శింగరకొండకు భక్తుల రాక పెద్ద ఎత్తున పెరగడం, పలు విద్యాలయాలు స్థాపించడంతో షాపులు కూడా పెద్ద ఎత్తున ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలో ఎక్కువ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసేందుకు స్థలం కొరత ఇబ్బందిగా మారింది. ఇదే పరిస్థితి కొనసాగితే మరో దశాబ్ద కాలం తరువాత శింగరకొండ తిరునాళ్లకు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసేందుకు స్థలం కొరత మరింత కొట్టి వచ్చినట్లు కనిపించే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రూపురేఖలు మారుతున్న అంజన్న క్షేత్రం



శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద జరుగుతున్న పనులు

ఇప్పటికే పలు అభివృద్ధి పనులు ప్రారంభం
చాలావరకు పూర్తి.. తిరునాళ్ల నాటికి ముస్తాబు చేస్తాం : ఈవో

అద్దంకి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే దాతల సహకారంతో పలు పనులు పూర్తి చేయగా, మరి కొన్నిజరుగుతున్నాయి. అదే సమయంలో దేవదాయశాఖ నిధులతో కూడా అభివృద్ధి పనులు చేస్తున్నారు. దీంతో నరసింహస్వామి దేవాలయం వద్ద రూపురేఖలు పూర్తిగా మారి పోతున్నాయి. ప్రతినెలా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహించే ప్రాంతం మరింత అభివృద్ధి చేస్తున్నారు.

దాతల సాయంతో...

కొండపైన లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద శిద్దా పాండురంగారావు కుటుంబ సభ్యులు రూ.10లక్షలతో గెస్ట్‌హౌస్ నిర్మాణం చేశారు. పట్టణానికి చెందిన కంభంపాటి శ్రీనివాసరావు రూ.30లక్షలతో భక్తుల విశ్రాంతి కోసం డార్మెంటరీ హాల్ కట్టించారు. పొదిలి మండలం జువ్వలేరుకు చెందిన శనగల వెంకటేశ్వరరెడ్డి సుమారు రూ.30 లక్షలతో అన్న దాన మండపం నిర్మాణం ప్రారంభించారు. దేవస్థానం నిధులు రూ.10లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నిధులు రూ.20లక్షల మ్యాచింగ్ గ్రాంట్‌తో దేవాలయం మండపం విస్తరణ పనులు చేపట్టారు.



శింగరకొండ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం

రూ.25లక్షలతో కొండ కింద నుంచి దేవాలయం వరకు ఉన్న పాత మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేశారు. మరో రూ.4లక్షల వెచ్చించి ప్రతి నెల లక్ష్మీనరసింహస్వామి కల్యాణం జరిగే ప్రాంతంలో అభివృద్ధి పనులు చేస్తున్నారు. 14వ తేదీ జరిగే వార్షిక తిరునాళ్ల నాటికి అన్ని పనులు పూర్తి అవుతాయని ఈవో కోటిరెడ్డి తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా దాతల సహకారంతో ఉచిత బస్సు సౌకర్యం, అన్నదానం, ప్రసాదం పంపిణీ చేస్తామని తెలిపారు.

సబ్ జూనియర్ కబడ్డీ క్రీడాపోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు(రూరల్), మార్చి9(ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల సబ్ జూనియర్ కబడ్డీ క్రీడాపోటీలకు ఆదివారం బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఒంగోలులోని డాక్టర్ పి.ఆనంద్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 150మంది బాలురు, 150 మంది బాలికలు హాజరయ్యారు. వారిలో ఎంపికైన క్రీడాకారులు వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో ఈనెల 14 ,15 ,16 తేదీల్లో జరిగే అంతర్ జిల్లాల సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో పాల్గొంటారని జిల్లా కబడ్డీ అసోషియేషన్ చైర్మన్ ఎస్.చంద్రమోహనరెడ్డి, అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన ఖర్చులకు కమ్మవారి సేవా సంఘం అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ నగదును అసోషియేషన్ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వై.పూర్ణచంద్రరావు, ట్రెజరర్ దాసరి రమేష్‌బాబు, సభ్యులు ఈదర వెంకటసురేష్, గడ్డం శ్రీనివాసరావు, కె.ప్రసాదరావు, చంద్రశేఖర్‌రెడ్డి, శిరిగిరి రంగారావు, శ్రీలక్ష్మి, శ్రావణి, అంకబాబు, రవీంద్రబాబు పాల్గొన్నారు.

బాలుర జట్టు: ఎ.అశోక్‌రెడ్డి, ఎస్.ఏడుకొండలురెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, డి.వి.మాధవరెడ్డి, సాయిజస్వంత్, ఎం.సోమేష్, డి.చంద్రశేఖరరెడ్డి, పి.జైపాల్‌రెడ్డి, ఎం.రత్నారెడ్డి, జి .కార్తిక్, ఎం.వెంకటరమణ, తిరుపతి, స్టాండ్‌బైగా ప్రేమ్‌కుమార్, యోసోబ్, ఎ.వెంకటరెడ్డి

బాలికల జట్టు : పి.ఝాన్సీ, డి.జ్యోత్స్నప్రియ, ఎ.సాయిలత, ఎస్.కార్తీక వెన్నెల, కె.నందిని, సీహెచ్‌వీ.మహేశ్వరి, కె.గాయిత్రి, బీఎస్‌గాయిత్రి, పి.రత్న దీపిక, వి.ధనలక్ష్మి, పి.స్వాతి, బి.తనూజ, కె.లోకేశ్వరి, స్టాండ్‌బైగా ఐ.శిరీష, జి.హన, బి.హర్షిణి, కె.బుజ్జి.

దివ్యాంగ టెన్త్ విద్యార్థులకు పరీక్షల్లో వెసులుబాట్లు

ఒంగోలు విద్య, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 17నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు హాజరవుతున్న దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం పలు వెసులుబాట్లు కల్పించింది. కొన్ని పరీక్షల నుంచి మినహాయింపు ఇచ్చింది. మరికొన్ని సబ్జెక్టుల్లో కనీస ఉత్తీర్ణత మార్కులను తగ్గించింది. అన్ని కేటగిరీల ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు తమ వైకల్యాన్ని ధ్రువీకరించే పత్రాలను సమర్పిస్తే అవి వర్తిస్తాయి. జిల్లాలో ఈ ఏడాది 241 మంది దివ్యాంగ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

మినహాయింపులు ఇవీ..

శారీరక, చలనం సంబంధిత వైకల్యం ఉన్నవారికి పరీక్ష రాసేందుకు స్క్రైబ్‌ను ఇవ్వడంతోపాటు గంటకు 20 నిమిషాల చొప్పున అదనపు సమయం కేటాయిస్తారు. కుష్టు వ్యాధి నయమైన వారు, మరుగుజ్జుతనం, యాసిడ్ దాడి బాధితులు, మస్తిష్క పక్షవాతం, కండర సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ విభాగంలో మినహాయింపులు కల్పించారు. ఈ విద్యార్థులకు ఒక్కో సబ్జెక్టులో 10 మార్కులు వచ్చినా ఉత్తీర్ణులైనట్లు ప్రకటిస్తారు. మూడు భాషల్లో ఒకదానికి ఒక పరీక్షకు మినహాయింపు ఉంటుంది.

అంగవైకల్యం, దృష్టి లోపం ఉన్న వారు ప్రతి సబ్జెక్టులో 20 మార్కులు సాధించినా ఉత్తీర్ణులైనట్లే. వీరికి కూడా పరీక్షల్లో ఒక భాష సబ్జెక్టుకు మినహాయింపు ఇచ్చారు.స్క్రైబ్‌తోపాటు అదనపు సమయం ఇస్తారు.

భౌతిక వైకల్యం, వినికిడి లోపం ఉన్న వారికి అన్ని సబ్జెక్టుల్లో కనీస ఉత్తీర్ణత మార్కులను 20కి తగ్గించారు. చెవిటి వారు, వినడం కష్టంగా ఉన్నవారికి ఇది వర్తిస్తుంది. వీరికి రెండు సబ్జెక్టులు మినహాయింపు ఇచ్చారు. అంటే ఒక సబ్జెక్టు పరీక్ష రాస్తే చాలు.

మాట, భాషా వైకల్యం ఉన్నవారు 20 మార్కులు సాధించినా వీరిని ఉత్తీర్ణులైనట్లు ప్రకటిస్తారు. మాట, భాషరాని వారు, అభ్యసనంలో వెనుకబడిన డిస్ లెక్సియా, డిస్ గ్రాఫియా, డిస్ క్యాలికోలియ, డిస్ ప్రాక్సియ, డెవలప్‌మెంట్ అఫాసియా ఉన్నవారు రాయితీలు పొందేందుకు అర్హులు. వీరికి మొత్తం మీద 20 మార్కులు మినహాయింపు ఇస్తారు.

ఆటిజంస్పెక్ట్రం డిజార్డర్ ఉన్న వారికి అన్ని సబ్జెక్టుల్లో కనీస ఉత్తీర్ణతా మార్కులను 35నుంచి 10కి తగ్గిస్తారు. వీరికి ప్రత్యేక సమాధాన పత్రాలు ఇస్తారు.

మానసిక స్థితి సరిగా లేని విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లో కనీస ఉత్తీర్ణత మార్కులను 35నుంచి 10కి తగ్గించారు. ఈవిద్యార్థుల అవసరాలను బట్టి పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

తీవ్ర నరాల వ్యాధితో బాధపడుతున్న వారు, రక్త సంబంధమైన వైకల్యం ఉన్న వారికి మూడో భాష(ఇంగ్లీషు) పరీక్షకు మినహాయింపు ఇచ్చారు. మల్టిపుల్ సైరోసిస్, పార్కిన్సన్ డిసీజ్, బ్లడ్‌లో హిమోఫీలియో, తల సేమియా, సికిల్‌సెల్ డిసీజ్ ఉన్నవారికి ఇది వర్తిస్తుంది.

నాటుసారాపై సమరభేరి

నవోదయం 2.0

తయారీదారులపై పీడీ చట్టం ప్రయోగం
జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు ప్రారంభం

ఒంగోలు క్రైం, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : నాటుసార అశాస్త్రీయ పద్ధతులలో తయారుచేసే మత్తుపానీయం. ఇది ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగిస్తుంది. నాటుసారా తాగడం వలన శరీరంలోని అన్ని అవయాలపై ప్రభావం పడుతుంది. ఇంత ప్రమాదకరమైన నాటుసారాను నిర్మూలించేందుకు ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమం ప్రారంభించింది. జిల్లాలో నాటుసారా తయారు చేయడం, విక్రయించడం, రవాణా చేయడం వంటి ప్రక్రియలను పరిగణనలోకి తీసుకొని మూడు విభాగాలుగా విభజించారు. నాటుసారా తయారు చేస్తున్న 39 గ్రామాలను గుర్తించారు. 7 గ్రామాలలో అమ్మకాలు జరుగుతున్నట్లు, మరికొన్ని గ్రామాలకు నాటుసారా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఆయా గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి నాటుసారా వలన కలిగే దుష్పరిణామాలను ఎక్సైజ్ శాఖ అధికారులు వివరిస్తున్నారు. అదే విధంగా ఉమ్మడి జిల్లాలో బాపట్ల, చీరాల, గిద్దలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కొన్ని గ్రామాల్లో నాటుసారా తయారు చేయడం, విక్రయాలు చేయడం జరుగుతుంది. ఈ మేరకు ఆయా ప్రాంతాలలో పోలీసు, రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో కలిసి అవగాహన కార్యాక్రమాలు ఏర్పాటు చేసి నాటుసారాపై సమరం ప్రారంభించారు.

నాటుసారా వలన కలిగే దుష్పరిణామాలు

- నాటుసారా సేవించడం వలన శరీరంలోని అవయవాలు అన్నీ తీవ్ర ప్రభావానికి గురవుతాయి.
- కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటాయి.
- నరాల బలహీనత వస్తుంది.
- మతిమరుపు వస్తుంది.
- వ్యాధినిరోధక శక్తి తగ్గి క్షయ, క్యాన్సర్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

నాటుసారా తయారీదారులపై పీడీ చట్టం

నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం విక్రయించే వారిపైనా కేసులు నమోదు చేస్తారు. నాటుసారా తయారీ, విక్రయదారులపై పీడీ చట్టం ప్రయోగిస్తారు. అదేవిధంగా సంక్షేమ పథకాలు తీసివేయాలని నిర్ణయం తీసుకున్నారు.



సారా సంచుల్లో రవాణా ఇలా...



ఒంగోలులో నవోదయం 2.0 కార్యక్రమం ప్రారంభ సభలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, పక్కన మరో మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్, ఎమ్మెల్యేలు జనార్దన్, విజయ్‌కుమార్(ఫైల్)

తయారీదారులుకు ప్రత్యామ్నాయ ఉపాధి

నాటుసారా తయారీదారులు, విక్రయదారులకు ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు చూపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నాటుసారా తయారీ పూర్తిగా వదిలివేసి ఉపాధి పెంచుకునేందుకు ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు చేపట్టారు. వివిధ పథకాల కింద రుణాలు మంజూరు చేసి వారి ఉపాధికి దోహదపడాలని ప్రభుత్వం నిర్ణయించింది.

తయారుచేసినా, విక్రయించినా నేరమే
కే హేమంత్‌నాగరాజు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

జిల్లాలో నాటుసారాను రూపుమాపేందుకు నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించాం. నాటుసారా తయారుచేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరం. అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై పీడీచట్టం ప్రయోగిస్తాం. అదేవిధంగా రూ.5 లక్షలు జరిమానా, 8 ఏళ్ల జైలు కూడా అనుభవించాల్సివస్తుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. అనంతరం కేసులు నమోదుచేస్తాం.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ

మద్దిపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మార్క్‌ఫెడ్ డీఎం కాకర్ల హరికృష్ణ చెప్పారు. ఆదివారం మండలంలోని మద్దిపాడు, చిమట సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందులు కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకే జిల్లాలో 45 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఆయా కొనుగోలు కేంద్రాల ద్వారా 18,664 మెట్రిక్ టన్నుల కందులను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. 48 గంటల్లోగా కందులు విక్రయించిన రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని చెప్పారు.

కమ్మవారి సేవా సంఘ నూతన కార్యాలయం ప్రారంభం

ఒంగోలు కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం నూతన కార్యాలయాన్ని ఆదివారం ఒంగోలు నగరం నిర్మల్‌నగర్ 4వ లైనులో ప్రారంభించారు. ప్రస్తుతం రాజీవ్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న కార్యాలయం పూర్తయ్యేంతవరకు సంఘ కార్యకలాపాలు ఇక్కడే నుంచి నిర్వహిస్తామని సంఘ అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ తెలిపారు. తమ సంఘం ద్వారా సహాయ సహకారాలు కావల్సిన వారు ఈ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న మండవ ధాత్రిజాకి ఫీజు నిమిత్తం రూ.30వేలు ప్రతిభ నల్లూరి వెంకటేశ్వర్లు, హర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్ చేతుల మీదుగా అందజేశారు. అదేవిధంగా ఆరో తరగతి చదువుతున్న చుండూరి లాస్యప్రియకు రూ.15వేలు, అప్పలనేని విక్రమసింహ, అప్పలనేని ఆత్వికలకి రూ.25వేలు అందజేశారు. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో జిల్లా తరఫున పాల్గొననున్న బాల, బాలికల ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు మండవ మురళీకృష్ణ వితరణ చేశారు.



విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న నిర్వాహకులు

శాంతినగర్‌లో నీటి ఎద్దడి

● మూడు రోజులకు ఒక సారి సరఫరా ● బిందె నీటి కోసం గంటల పాటు ఎదురుచూపులు ● మరమ్మతులకు గురైన బోర్లు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలో నివసించే చెంచు జీవితాల్లో వెలుగులు ఏమో తెలీదు కాని వారికి కనీస వసతులు కల్పనలో అధికారులు, పాలకులు మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నారు. గుక్కెడు నీటి కోసం కూడ గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు.


నిరుపయోగంగా ఉన్న ఇంటింటి కొళాయిలు

మండలంలోని గంజి వారిపల్లి పంచాయతీలోని శాంతినగర్‌లో సుమారు 200 మంది గిరిజనులు ఉన్నారు. గూడెంలో మూడు బోర్లు ఉన్నా అవి మరమ్మతులకు గురయ్యాయి. ఏడాదికాలంగా వాటిని మరమ్మతు చేయ లేదని గిరిజనులు పేర్కొంటున్నారు.

రెండేళ్ల క్రితం బోర్లు ఏర్పాటు చేసినా..

జలజీవన్ పథకం కింద గూడెంలో రెండేళ్ల క్రితం బోర్లు ఏర్పాటు చేశారు. ఇంటింటికి కొళాయిలు బిగించారు. అయితే వేసిన బోరు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ఇంటింటికి కొళాయిలు ఎక్కడిక్కడ మరమ్మతులకు గురై దర్శనం ఇస్తున్నాయి. దీంతో నీటికి తీవ్రఇబ్బందులు ఏదుర్కొంటున్నామని కుడుముల అంకమ్మ, భూమని పోతమ్మ తెలిపారు. గూడేనికి సమీపంలోని గాంధీనగర్ నుండి పైపుల ద్వారా వస్తున్న నీరు పట్టుకుంటున్నామని వారు తెలిపారు. ఒక్కో బిందె గంటల సమయం పడుతుం దని వాపోతున్నారు. అది కూడ మూడు, నాలుగు రోజులకు ఒకసారి వస్తున్నాయన్నారు. ఆ నీటి కోసం పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఉందని పేర్కొంటు న్నారు. కుటుంబాలు మొత్తం నీటి కోసం బిందెలతో ఎదురుచూడాల్సి ఉందన్నారు. సమస్యపై గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లామని బోర్లను వేయిస్తానని చెప్పినట్లు గిరిజన మహిళలు తెలిపారు.


బోర్లు మరమ్మతుకు గురయ్యాయని చెబుతున్న గిరిజనులు

నీటి ఎద్దడి లేకుండా చూస్తాం : జేఈ

శాంతినగర్‌గూడెంలో నీటి ఎద్దడిపై ఆర్.డ.బ్ల్యూఎస్ జేఈ జట్సన్‌పాల్‌ను వివరణ కోరగా గూడెంలో నీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు. త్వరలో కొత్త బోర్లు వేస్తామన్నారు. కొత్తబోర్ల కోసం రూ. 13.62 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ఆ నిధులతో సమస్య పరిష్కరిస్తామన్నారు.

పొలం వద్ద ఘర్షణ.. ఇరువురిపై మారణాయుధాలతో దాడి

మార్కాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పొలం వద్ద జరిగిన ఘర్షణలో మారణాయుధాలతో దాడి చేయడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఈ దాడిలో స్థానిక గొర్లగడ్డకు చెందిన షేక్ మహబూబ్‌సుభాని, షేక్ అన్వర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు స్థానిక కంభం రోడ్డులోని పెట్రోల్ బంకు ఎదురుగా లక్ష్మీచెన్నకేశవ స్వామి మాన్యం భూమి ఉంది. ఆ భూమి పక్కన సుభాని అన్వర్లకు చెందిన భూమి ఉంది. ఈ క్రమంలో దేవదాయశాఖ భూమిని బత్తుల పెద్దఅల్లూరయ్య, అల్లూరయ్య, బాలకృష్ణలతోపాటు మరో ముగ్గురు వ్యక్తులు చదును చేస్తున్నారు. దేవదాయశాఖ భూమితో పాటు పక్కనే ఉన్న సుభానికి చెందిన భూమిని కూడా వీరు ఎక్సకవేటర్‌తో చదును చేస్తుండడంతో అక్కడకు వెళ్లిన సుభాని అడ్డుకున్నారు. దేవదాయశాఖ అధికారులకు విషయాన్ని తెలయజేశారు. అక్కడకు వచ్చిన దేవాదాయశాఖ సిబ్బంది ఆక్రమణ దారులను హెచ్చరించి ఎక్స్‌కవేటర్‌తో జరుగుతున్న పనులు నిలిపివేయించారు. అయితే ఈ విషయంలో సుభాని, అన్వర్‌లతో బత్తుల పెద్దఅల్లూరయ్య, అల్లూరయ్య, బాలకృష్ణలతోపాటు మరో ముగ్గురు వ్యక్తులు గొడవపడ్డారు. ఈ క్రమంలో సుభాని తలపై వెనుకనుంచి పదునైన మారణాయుధంతో అల్లూరయ్య మోదాడు. తప్పించబోయిన అతని తమ్ముడు అన్వర్‌పై కూడా కూడా వీరు దాడి చేశారు. దీంతో అన్వర్ తలకు గాయమైంది. వెంటనే క్షతగాత్రులను చుట్టు పక్కల వాళ్ల ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.


దాడిలో తీవ్రంగా గాయపడ్డ సుభాని

జర్నలిస్టులకు ఆదర్శప్రాయుడు రమణయ్య


రమణయ్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వెంకటరెడ్డి, జర్నలిస్టులు

మార్కాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నేటి జర్నలిస్టులకు ఆదర్శప్రాయుడు ఓవీ రమణయ్య అని మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు, తొలితరం జర్నలిస్టు ఓవీ రమణయ్య 35వ వర్ధంతి సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం జర్నలిజం అంటే దేశభక్తి ఉన్న వాళ్లు మాత్రమే కొనసాగేవాళ్లన్నారు. ఆ రోజుల్లో ఎన్నో నిర్బంధాల మధ్య విలేకరులు వృత్తిని కొనసాగించారన్నారు. మార్కాపురం ప్రాంతంలో మొదటి జర్నలిస్టు ఓవీ రమణయ్య చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. బ్రిటిష్ వాళ్ల నిర్బంధాలకు కూడా భయపడకుండా స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో పనిచేసిన గొప్ప వ్యక్తి అన్నారు. సుమారు నాలుగు దశాబ్దాలకు పైగా జర్నలిస్టుగా కొనసాగిన ఆయన వృత్తి పయనం వెలకట్టలేనిదన్నారు. ముందుగా రమణయ్య కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎన్‌వీ రమణ, సీనియర్ జర్నలిస్టు ఓవ మల్లిక్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు డి.మోహన్‌రెడ్డి, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి పక్కా ప్రణాళిక : ముత్తుముల

రూ.10 కోట్లతో మురుగునీటి శుద్ధికేంద్రం

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి శంకుస్థాపన

గిద్దలూరుటౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధికి పక్కా ప్రణాళికతో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ముండ్లపాడు రోడ్డులో రూ.10 కోట్లతో ఏర్పాటు చేయనున్న మురుగునీరు శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ) భూమి పూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీ ని నెరవేరుస్తామన్నారు. గిద్దలూరు నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అలాగే పట్టణాభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు పోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, జడ్పీటీసీ సభ్యు డు బుడత మధుసూదన్, పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషావలి, కౌన్సిలర్లు చంద్రశేఖర్‌యాదవ్, పెద్దవలి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

సీనియర్ సహాయకురాలి మృతికి నివాళి


చెంచుకుమారి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఎర్రగొండపాలెం రిటైర్ సీనియర్ అసిస్టెంట్ టీ.చెంచుకుమారి చేసిన సేవలు చిరస్మరణీయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని పిడికిటివారిపల్లె గ్రామంలో ఆదివారం ఆమె సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె భర్త కాకర్ల నరసింహారావును ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ మన్నే రవీంద్ర, టీడీపీ నాయకులు కాకర్ల కోటయ్య, మేడికొండ లక్ష్మీనారాయణ, వెంగల్‌రెడ్డి, మన్నయ్య, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : ఐసీడీఎస్ విశ్రాంత సీనియర్ అసిస్టెంట్ చెంచుకుమారి మృతికి ఏపీటీడబ్ల్యూజే యూనియన్ సీనియర్ నాయకులు షేక్ నూరిద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ బాషా, కార్యవర్గ సభ్యులు కటికి శంకర్, సుభాష్, లాలు, షేక్‌వలి, ప్రకాష్, రమేష్‌లతో పాటు పుల్లలచెరువు మండల జర్నలిస్టులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొని అమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

జమాల్‌వలి దర్గాలో గంధమహోత్సవం

గిద్దలూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట గ్రామంలో వెలసిన శ్రీహజరత్ జమాల్‌వలి దర్గాలో ఆదివారం గంధంమహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకొని దర్గాలో తొలిరోజు గంధం మహోత్సవాన్ని దర్గా పీఠాధిపతి షేక్ జమాల్‌ఖాద్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు గంధం మహోత్సవంలో పాల్గొని దర్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

బధిరులకు అండగా ఉంటాం

ఒంగోలు కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా బధిరుల సంఘం జ నరల్ బాడీ సమావేశం, ఎన్నికలు ఆదివారం ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై సూర్యశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ బధిరులకు తనవంతు సహాయం అందజేస్తానని చెప్పారు. తమ ట్రస్ట్ ద్వారా అండగా ఉంటామని చైర్మన్ సయ్యద్ షహనాజ్, సెక్రటరీ సర్దార్ బాషా అన్నారు. కార్యక్రమంలో బధిరుల సంఘం ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ రాజేంద్ర, మారెళ్ల సుబ్బారావు, జనసేవ శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మురుగునీటి వాల్స్

పొంగిపొర్లుతున్న నాలాలు

పొదిలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన మురికి కాలువ వాల్స్ ప్రమాదకరంగా ఉన్నాయి. మురికి కాలువలు పూర్తిగా నిండి రహదారుల పై నీరు నిలుస్తోంది. మూతవాల్స్ తొలగించి కాలువల్లో నీరు తొలగించారు. కానీ తీసిన వాల్‌ను అలాగే వదిలేయడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. అక్కడ గుంత ఉన్న విషయం గమనించని ద్విచక్ర వాహన దారులు అడ్డులేదని స్పీడుగా వెళ్లడంతో ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు అంటున్నారు. పూడిక తీసిన తర్వాత యథావిధిగా వాల్స్‌ను ఏర్పాటు చేయకుండా వదిలేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. విశ్వనాథపురం పవర్‌ఆఫీస్ లైన్‌లో, సాయిబాబా మందిరం సమీపంలో, రత్తయ్య హోటల్ సమీపంలో తీసిన వాల్స్‌ను సరిచేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ప్రమాదకరంగా ఉన్న వాల్స్‌ను గుర్తించి సరిచేయాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు. అదేవిధంగా విశ్వనాధపురం ఒకటవలైన్ గీతాంజలి స్కూల్ సమీపంలో సైడుకాలువ నిండి రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తున్నా నగరపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని నివాసిత ప్రజలు వాపోతున్నారు. కాలువలో నీరు రోడ్డుపైకి వచ్చి దుర్గంధం వెదజల్లుతుందని, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థు లకు ఇబ్బందికరంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. అధికారులు సమస్యను పరిశీలించి త్వరితగతిన తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



రత్తయ్య హోటల్ సమీపంలో, విశ్వనాథపురం పవర్‌ఆఫీస్ లైన్‌లో మూతలేని కాలువలు



గీతాంజలి స్కూల్, ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో రోడ్డుపైకి వచ్చిన మురుగు

పోలేరమ్మకు ఆదివారం ఉగాది జాతర

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఉగాది ముందు వచ్చే ఐదు వారాల జాతరలో భాగంగా రెండో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి పోలేరమ్మకు డివిజన్‌లోనే కాక రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో భక్తులు ఉన్నారు. అల్లూరమ్మ, అల్లూరయ్య అనే పేర్లు పెట్టుకుని అమ్మవారిని కొలుస్తారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, వర్షాలు పడి పంటలు పండాలని తమ వ్యక్తిగత అవసరాలు తీరాలని, కుటుంబ సంక్షేమం కోసం అమ్మవారికి మొక్కుకుంటారు. ఆదివారం అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. నాగ దేవతలకు పూజలు నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, పోలేరమ్మ ఉత్సవ కమిటీ నాయకులు దొడ్డా రవికుమార్, రామాంజనేయులు, మట్టం శ్రీనివాసులు, వన్నెబోయిన బ్రహ్మం, గుమ్మా అంకయ్య, శ్రీనివాసులరెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.



పొంగళ్లు వండుతున్న మహిళలు, నాగశిలలకు పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గిద్దలూరు : మండలంలోని నరవ గ్రామంలో కొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 15వ తేదీ వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలు తొలిరోజు ఆదివారం స్వామి వారికి పంచామృతాభిషేకంతో ప్రారంభమయ్యాయి. అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాలలో దేవస్థాన కార్య నిర్వహణాధికారి శ్రీనివాసులు, దేవస్థాన ఫౌండర్ ట్రస్టీ ఈదుల చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

12న వార్షికోత్సవ పూజలు

గిద్దలూరు : పట్టణంలోని శ్రీసత్యసాయి ప్రేమసుధా మందిరం వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 12న బుధవారం నిర్వహిస్తున్నట్లు సత్య సాయి సేవాసమితి కన్వీనర్ సూరె అనంతరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 23వ వార్షికోత్సవం సందర్భంగా 12వ తేది బుధవారం ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన, 8గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, రాత్రి 7గంటలకు సామూహిక నామ సంకీర్తన తదితర కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు హాజరుకావాలని కోరారు.


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

అవీ..ఇవీ

రెండు బైకులు ఎదురెదురుగా ఢీ

● నలుగురికి గాయాలు


క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

త్రిపురాంతకం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని గొల్లపల్లి సమీపంలో ఆదివారం చోటుచేసుకొంది. వెల్లంపల్లికి చెందిన యద్దనపూడి గురవయ్య, విమలమ్మ గొల్లపల్లి వద్ద ఉన్న తమ పొలానికి బైకుపై వెళుతున్నారు. వీరిని ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గురవయ్య, విమలమ్మకు తీవ్రగాయాలయ్యాయి. మరో బైకుపై ఉన్న నారి రాజశేఖర్, కరేడి వెంకట నారాయణలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను త్రిపురాంతకంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గురవయ్య, విమలమ్మలను నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

పేదలకు బియ్యం పంపిణీ

కంభం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కంభం పట్టణానికి చెందిన షేక్ బాజిద్ బాషా డాక్టర్ లతీఫ్ ఆధ్వర్యంలో తమ తండ్రి షేక్ మహబూబ్ బాషా జ్ఞాపకార్థం దాదాపు రూ.2లక్షల విలువైన బియ్యం టిక్కీలను 150 మంది నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాజిద్‌బాషా మాట్లాడుతూ ఏటా 'షై జీవన్ ఫౌండేషన్' ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రతి రంజాన్ మాసంలో పేదలకు బియ్యం, నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


పేదలకు బియ్యం టిక్కీలను పంపిణీ చేస్తున్న దాతలు

చిన్నతనంలోనే లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

● అస్సోం రాష్ట్ర ఛీఫ్ సెక్రటరీ ఆరిజ్ అహ్మద్


ఉపాధ్యాయబృందంతో ఆరిజ్ అహ్మద్

పొదిలి, మార్చి9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుండే లక్ష్యాలను నిర్దేశించుకొని ప్రణాళికాబద్ధంగా చదువును కొనసాగించాలని అస్సాం రాష్ట్ర ఛీఫ్ సెక్రటరీ ఎండీ ఆరిజ్ అహ్మద్ అన్నారు. పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మనం జీవితంలో ఏం సాధించాలనుకుంటున్నామో 10వ తరగతిలోనే నిర్ధేశించుకోవాలన్నారు. తద్వారా మీ ఇష్టాలు, ఆలోచనలకు అనుగుణంగా చదువులో ముందుకు వెళ్లాలన్నారు. ప్రణాళికా బద్ధంగా లేకపోతే లక్ష్యాలను చేరుకోవడం కష్టతరమవుతుందన్నారు. పై చదువులకు వెళ్లే కొద్దీ ఎలాంటి ఉద్యోగాలు ఉంటాయి. వాటి సాధనకు ఎలా ముందుకు వెళ్లాలన్న విషయాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం.శ్రీనివాసులరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామలక్ష్మి, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరీమూన్ బీబీ, కరిముల్లాబేగ్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

బిలాల్ మసీద్‌లో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్‌విందులో ఆహారం వడ్డిస్తున్న కృష్ణకిషోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 7వ వార్డులోని బిలాల్ మసీదులో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందులో ఎమ్మెల్యే సోదరుడు క్రిష్ణకిశోర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం క్రిష్ణకిశోర్‌రెడ్డి ఇఫ్తార్‌లో వడ్డించారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో నటి అనసూయ సందడి

గిద్దలూరు టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆదివారం గిద్దలూరులో సినీ నటి అనసూయ సందడి చేశారు. పట్టణంలో ఓ వస్త్రదుకాణం ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. పట్టణ ప్రజలు భారీ స్థాయిలో హాజరై తమ అభిమాన నటిని చూసేందుకు ఎగబడ్డారు. కార్యక్రమంలో నటి అనసూయ జ్యోతి వెలిగించగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి షోరూంను ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో అనసూయ, అశోక్‌రెడ్డి

సీనియారిటీ జాబితాలో తప్పులను సవరించాలి

● హిందీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పీఎం.ఖాన్

ఒంగోలు విద్య, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): హిందీ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాలోని తప్పులను సవరించాలని హిందీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పీఎం.ఖాన్ కోరారు. ఆదివారం ఈమేరకు పలు అభ్యంతరాలు తెలుపుతూ స్థానిక డీఈవో కార్యాలయంలో అభ్యంతరాల లేఖను అందజేశారు. ప్రస్తుత సీనియారిటీ జాబితా 2019 ప్రమోషన్ లిస్టుకు అనుగుణంగా ఉండాలని, నాడు ప్రమోషన్ పొందిన తెలుగు, హిందీ, వ్యాయామ ఉపాధ్యాయుల సీనియారిటీని 2019నవంబరు 1నుంచి పరిగణించాలని కోరారు. అంతర్ జిల్లా బదిలీల్లో ఇక్కడకు వచ్చిన సీనియారిటీని వారు ఈ జిల్లాలో చేరిన తేదీ నుంచి పరిగణలోకి తీసుకోవాలని, 2019 కంటే ముందు ప్రమోషన్ పొందిన వారి జాబితా కూడా మెరిట్ కమ్ రోస్టర్ పద్ధతిలో ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి బాస్కరరావు, కందుకూరు డివిజన్ అధ్యక్షుడు మస్తాన్‌వలి, షేక్ ఉజ్మాబాణు, టి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



చిన్నారులకు శిక్షణ ఇస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధి

చిన్నారులకు ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శిక్షణ

దొనకొండ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్ఎస్ఎస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో దొనకొండలోని ఆనంద ఆశ్రమంలో చిన్నారులకు రెండు రోజుల పాటు ఉచిత శిక్షణ అందించారు. ఈ శిక్షణకు జిల్లాలోని దొనకొండ, ఒంగోలు, మార్కాపురం, గిద్దలూరు, పెద్దారవీడు, దోర్నాల, రాగసముద్రం, కలుజువ్వలపాడు, కంకణాలపల్లి ప్రాంతాలకు చెందిన 70 మంది పాల్గొన్నారు. వారికి శంఖం, వేణువు, ప్రణవ, ఆనక్ తదితర వాటిపై ఉచితంగా శిక్షణ ఇచారు. శిక్షణ వచ్చిన చిన్నారులకు ఆశ్రమ ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి ఉచిత వసతి, భోజన సౌకర్యాలను కల్పించారు.



చలో పిఠాపురం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నేతలు

చలో పిఠాపురంను విజయవంతం చేయాలి

పామూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14న పిఠాపురంలో నిర్వహించే జనసేన పార్టీ ఆవిర్భావ సభను జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నియోజకవర్గ పాయింట్ ఆఫ్ య్యూ నాగరాజు పిలుపునిచ్చారు. స్థానిక జనసేన కార్యాలయంలో నియోజకవర్గ కార్యవర్గం సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. అనంతరం చలో పిఠాపురం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై. రహీముల్లా, మండల కమిటీ అధ్యక్షుడు దరిశి ఏడుకొండలు, వి. బాబురావు, షేక్ సందాని బాష, మన్నేపల్లి మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ జిల్లా మహాసభల్లో మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు కొండారెడ్డి

అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

దర్శి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికుల ఉద్యోగ భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చట్టాన్ని చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి సూచించారు. దర్శిలో ఆదివారం జరిగిన సీఐటీయూ జిల్లా మహసల్లో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణం, ఆటో వర్కర్స్ కార్మికులు ఎంతోకాలంగా ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురవుతున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు కూడా వారికి సక్రమంగా అందటం లేదన్నారు. కొత్తగా తెచ్చిన మోటారు వాహన చట్టం వలన డ్రైవర్లకు జైలుశిక్ష, జరిమానా పడేవిధంగా ఉందన్నారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలు రూ.10 వేలకు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ దర్శి నియోజకవర్గ నాయకులు రంగారావు, స్థానిక నాయకులు ఈ. నాగేశ్వరరావు, యు. నారాయణ, ఇశ్రాయేలు, గోవిందమ్మ, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు విశేష అలంకారం

తాళ్లూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పేరొంది అత్యంతగా ప్రసిద్ధి చెందిన సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో గల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. చల్లంగా చూడమ్మ గంగమ్మ తల్లి అని వేడుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన



విశేష అలంకారంలో గంగమ్మ తల్లి

భక్తులు గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయబ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ పూజారులు ప్రకాశ్‌పంతులు, విజయలక్ష్మి,బాలరాజు, అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, దేవదాయ శాఖ ఆర్ఏ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు భక్తుల ప్రత్యేక పూజలు

ముండ్లమూరు : మండలంలోని పలు గ్రామాల్లో వేంచేసి ఉన్న పోలేరమ్మ అమ్మవార్లకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముండ్లమూరు, నూజెండ్లపల్లి , పసుపుగల్లు, బొప్పూడివారిపాలెంలలో పోలేరమ్మ అమ్మవార్లు, శంకరాపురంలో నాంచారమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పసుపుగల్లులో ఉచిత వైద్య శిబిరం

ముండ్లమూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసుపుగల్లులో ఆదివారం పెదకాకాని శంకర్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో 56 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 46 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మిగతా పది మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు.

వంతెన కూలి మూడేళ్లు - వెతలు ఇంకెన్నాళ్లు?

చందవరం వద్ద సాగర్ కెనాల్‌పై రాకపోకలకు ప్రజల అవస్థలు

పట్టించుకోని గత వైసీపీ పాలకులు

మూడు కిలోమీటర్లు తిరిగి పొలాలకు వెళుతున్న రైతులు

టీడీపీ నేతలు స్పందించాలని విజ్ఞప్తి

దొనకొండ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందవరం గ్రామ సమీపంలోని సాగర్ కెనాల్‌పై ప్రజలు రాకపోకల కోసం నిర్మించిన వంతెన దాదాపు మూడేళ్ల క్రితం అకస్మాత్తుగా రాత్రి సమయంలో కుప్పకూలింది. ప్రజలకు ఎంతో ప్రాముఖ్యమైన ఈ వంతెన నిర్మాణం గురించి అప్పటి వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పట్టించుకోలేదు. ఫలితంగా ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చందవరం, దేశిరెడ్డిపల్లి గ్రామ ప్రజలకు చెందిన దాదాపు 300 ఎకరాల వ్యవసాయ భూమి సాగర్‌కాలువకు అవతలివైపున ఉన్నందున రాకపోకల కోసం అప్పట్లో కెనాల్‌పై వారధి నిర్మాణం చేపట్టారు. 2022 ఫిబ్రవరి నెలలో రాత్రి సమయంలో వంతెన కాలువలోకి కుప్పకూలింది. దీంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు, పశుపోషకులు రాకపోకలు జరుపుకునేందుకు వీల్లేకపోయింది. వంతెన నిర్మాణం గురించి అప్పటి వైసీపీ ప్రభుత్వంలో అధికారులకు, పాలకులకు పలుసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న నాథుడే లేడని ప్రజలు వాపోతున్నారు. రోజూ వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు చుట్టూ మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లలేక కూలిన వంతెనపై నిచ్చెనలా కర్రలు ఏర్పాటు చేసుకొని ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు జరుపుకుంటున్నారు. ఆ సమయంలో ఒకరిద్దరు అదుపుతప్పి కాలువలో పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. పశుపోషకులు తప్పనిసరి పరిస్థితుల్లో మూడు కిలోమీటర్లు నడిపిస్తూ మరో వంతెన గుండా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చందవరం గ్రామానికి వచ్చిన సమయంలో వంతెనలేక పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని ప్రత్యక్షంగా చూసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వంతెన నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు చర్యలు తీసుకోలేదు.



మూడేళ్ల క్రితం సాగర్ కాలువపై కూలిన వంతెన



త్వరలో వంతెన నిర్మాణం

సాగర్‌కాలువపై వంతెన కూలి ప్రజలు మూడేళ్లుగా రాకపోకలు జరుపుకునేందుకు పడుతున్న ఇబ్బందులను టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దృష్టికి తీసుకెళ్లాం. ఆమె ప్రత్యక్షంగా చూసి స్పందించి వంతెన నిర్మాణ ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులు వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు అయిన వెంటనే నిర్మాణం చేపడతాం.

- యగ్గోని యల్లారెడ్డి, టీడీపీ నాయకులు, చందవరం గ్రామం

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

కన్నుల పండువగా స్వామివార్ల శాంతి కల్యాణం

సీఎస్‌పురం (పామూరు) మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి -భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థాన విగ్రహప్రతిష్ఠ, పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం విగ్రహ విమానశిఖర, గరుడ, జీవధ్వజ, రాజగోపుర ప్రతిష్ఠ కార్యక్రమాలను అర్చకులు నారాయణం దీక్షితుల బృందం నిర్వహించింది. ఈ సందర్భంగా కుంభారాధనం, అగ్ని ప్రణయనం, యంత్ర ప్రతిష్ఠ ప్రత్యేక విశేషపూజా కార్యక్రమాలను జరిపించారు.. ఈ వేడుకలకు రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వర యాదవ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణదాత, విశ్రాంత జాయింట్ కలెక్టర్ పిడుగు బాబురావు, విజయ దంపతుల ఆధ్వర్యంలో అతిథులను శాలువాతో ఘనంగా సన్మానించి స్వామివార్ల చిత్రపటాలను అందజేసారు. మధ్యాహ్నం స్వామివార్ల శాంతి కల్యాణంను రుత్వికులు నిర్వహించారు. రాత్రికి మేళతాళాలతో బాణాసంచా నడుమ అంగరంగ వైభవంగా స్వామివార్ల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ అధికార ప్రతినిధి షేక్ రజ్జబ్‌బాష,పిడుగు సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ఆలా తిరుపతయ్య, డాక్టర్ గద్దె ఏడుకొండలు, ఎన్ఆర్ఐ పిడుగు సాయి అభినయ్, భార్గవి దంపతులు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, డి.మోహన్‌రెడ్డి, కె.నాగప్రసాద్, బండ్లనారాయణ, గ్రామస్థులు, భక్తులు, పాల్గొన్నారు.



దేవదాయశాఖ మంత్రి ఆనంను సన్మానిస్తున్న దేవస్థాన నిర్వహకులు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి , పక్కన పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల

కురిచేడు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల ఆదివారం వైభవంగా మండలంలోని రెండు చోట్ల జరిగింది. కురిచేడు కోనవల్లభరాయ కొండమీద వెలసిన లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దేకనకొండ శింగరకొండ మీద వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.స్వామివారికి పంచామృత అభిషేకం, బిల్వార్చన నిర్వహించారు.

భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం రెండు విద్యుత్ ప్రభలు నిర్మించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఎస్ఐ శివ బందోబస్తు నిర్వహించారు.

ఆలయాల అభివృద్ధికి నడుం కట్టాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ నడుం కట్టి ముందుకు సాగాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక కనకపట్టణంలోని శంకర మఠం శివాలయంలో ఆదివారం మహా మంటపం నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో పరులకు సేవ చేయాలన్నారు. తోటి వారికి అందించే సేవలు భగవంతునికి చేసినట్టే అన్నారు. ప్రతి వ్యక్తిలోని మానవత్వాన్ని తట్టి లేపేది దేవాలయాలే అన్నారు. ప్రతి మనిషిలో భగవత్సరూపాన్ని చూసినప్పుడే సమ సమాజం ఏర్పడుతుందన్నారు. ఆలయాల అభివృద్ధిలో తన వంతు సహకారం ఎప్పుడూ అందిస్తామన్నారు. అందరూ ఒక్కటై దేవాలయాల నిర్మాణాలను విరివిగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలు ఓబులు రెడ్డి, పోతు కొండారెడ్డి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వైద్యశాల అభివృద్ధికి రూ. 50 వేల విరాళం

పామూరు : కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ పనుల అభివృద్ధి కోసం పామూరు పాత చెరువు నీటి సంఘం చైర్మన్ పాలపర్తి రమణయ్య తన వంతుగా రూ.50 వేల నగదును విరాళంగా ఎమ్మెల్యే ఉగ్రకు ఆదివారం అందజేశారు. కనిగిరిలోని ఉగ్ర క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా విరాళ నగదును అందించారు. దాత రమణయ్యను ఉగ్ర అభినందించారు. ఉగ్రను కలిసిన వారిలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యదర్శి సయ్యద్ అమీర్ బాబు, నాయకులు పాలపర్తి శ్రీనివాసులు, రాము, నరేష్, గ్రామ మాజీ డీలర్ పాలపర్తి మస్తాన్, డీలర్ హరి బాబులు ఉన్నారు.



ఉగ్రకు విరాళం నగదును అందజేస్తున్న పాలపర్తి రమణయ్య

పీసీపల్లిలో ఉపాధ్యాయ దంపతుల విరాళం

పీసీపల్లి :కనిగిరి ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కోసం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి దంపతులు 25వేల రూపాయల విరాళాన్ని కనిగిరి శాసనసభ్యుడు ఉగ్ర నరసింహారెడ్డికి అందించి పలువురికి ఆదర్శంగా నిలిచారు.ఆదివారం కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని కలిసిన అంజనీదేవి,శ్రీనివాసరావు దంపతులు వారి కుమార్తె వివాహానికి ఆహ్వానించడంతో పాటు వైద్యశాల అభివృద్ధి కోసం 25వేల రూపాయల నగదును ఎమ్మెల్యే ఉగ్రకు అందజేశారు. విరాళం ఇచ్చిన దంపతులను ఆయన అభినందించారు.



వైద్యశాల అభివృద్ధికి ఎమ్మెల్యేకు నగదును అందజేస్తున్న అంజనీ దేవి, శ్రీనివాసరావు దంపతులు



టీస్టాల్‌లో క్రికెట్ చివరి దశలో ఉత్కంఠగా తిలకిస్తున్న యువత

టీం ఇండియా విజయంపై హర్షం

కనిగిరి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : టీ- 20- 2025 కప్ ఫైనల్ క్రికెట్ పోటీల్లో టీం ఇండియా న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. 50 ఓవర్లలో న్యూజిలాండ్ 7వికెట్లను కోల్పోయి 251 పరుగులు తీసింది. రెండోసారి బ్యాటింగ్ బరిలో దిగిన ఇండియా 49 ఓవర్లలో 5వికెట్ల తేడాతో 254 పరుగులు తీసి 12ఏళ్ల తర్వాత టీ-20కప్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఇండియా ఖాతాలో ఇది మూడోసారి చాంపియన్ ట్రోఫీని గెలుచుకున్న రికార్డు దక్కించుకుంది. అత్యంత ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచ్‌ను తిలకించేందుకు పట్టణంలో యువత అత్యంత ఆసక్తి కనపరచారు. పట్టణంలోని ఓ టీస్టాల్ వద్ద క్రికెట్‌ను తిలకించేందుకు యువత చేరుకోవటంతో సందడి నెలకొంది. చివరిగా ఇండియా క్రికెటర్ రాహుల్ ఫోర్ కొట్టి విజయం సాధించిన తరుణంలో యువత పెద్ద ఎత్తున కేరింతలు కొడుతూ గంతులు వేసి సంబరాలు చేసుకున్నారు.



మోదేపల్లి మేజరు వద్ద వస్తున్న నీటిని ఎన్ఎస్‌పీ అధికారులతో కలసి పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు

వారబందీతో ఆయకట్టు చివరి భూములకు సాగర్ జలాలు

● డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు

ముండ్లమూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మోదేపల్లి మేజరుకు వారబందీ విధానంతో చివరి భూముల రైతులకు నీరు అందిస్తున్నామని మోదేపల్లి మేజరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఎన్ఎస్‌పీ అధికారులతో కలసి సాగర్ జలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేజరు పరిధిలోని మైనర్ కాలువల వద్ద పేరుకు పోయిన తూటు కాడ, లస్కర్ల చేత తీయించే చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం మేజరుకు మూడు వందల క్యూసెక్కులు మాత్రమే నీరు వస్తుందని, వాటి వల్ల చివరి భూముల రైతులకు చేరక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మేజరుకు పూర్తి స్థాయిలో నీటి మట్టం పెంచి మేజరు పరిధిలోని శంకరాపురం, రామకృష్ణాపురం, పోలారం, నాయుడుపాలెం, పూరిమెట్ల, ఉమా మహేశ్వర అగ్రహారం పొలాల్లో రైతులు సాగు చేసిన పంటలకు నీరు వచ్చే విధంగా చూడాలని ఎన్ఎస్‌పీ అధికారులను కోరారు. ప్రస్తుతం నీటి ఎద్దడితో పంటలు ఎండు ముఖం పట్టాయన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని చివరి భూములకు నీరు అందించాలన్నారు. ఈ కార్యకమంలో జేఈలు సత్యనారాయణ, ప్రసాదు, సిబ్బంది ఉన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సీఎం సహాయనిధి పేదలకు భరోసా

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి పేదలకు భరోసా అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి ప్రాంగణంలో ఆదివారం అనారోగ్య బాధితులకు రూ.15.68లక్షలు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యకారణంగా వైద్యం చేయించుకోలేక తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్న పేద కుటుంబాల వారికి సీఎం సహాయనిధి కింద ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే పేద కుటుంబాలకు చెందిన సభ్యులు మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఆ సమయంలో అప్పులు చేసి కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయన్నారు. పలు ప్రయివేటు ఆసుపత్రులలో చికిత్స పొందిన బాధితులకు భరోసా కల్పించేందుకు సీఎం సహాయనిధి ఎంతో చేదోడుగా నిలుస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



స్వామివారికి నైవేద్యం తెస్తున్న భక్తులు

నారాయణస్వామికి మహానైవేద్యం

సీఎస్‌పురం(పామూరు) మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం మహానైవేద్యాన్ని సమర్పించి పూజ కార్యక్రమం నిర్వహించి భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యకమాల్లో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బాబా ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా సత్యాలు

కనిగిరి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సాయిబాబా దేవస్థానం నూతన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన వ్యాపార వేత్త కొప్పరపు సత్యాలును ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దశాబ్దకాలంగా బాబా ఆలయకమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దేవకి సుబ్రమణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు కొనసాగుతున్నారు. బాబా ఆలయానికి శాశ్వత ఉభయకర్తలు, స్థల దాతలు, పూర్వపు కమిటీ సభ్యుల ఏకగ్రీవ ఆమోదంతో కొప్పరపు సత్యాలును ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. త్వరలో నూతన కార్యవర్గం ఎంపిక చేస్తామన్నారు. గతంలో మాదిరిగానే బాబా ఆలయ అభివృద్ధికి తనకు సంపూర్ణ సహకారం అందించాలని సత్యాలు కోరారు.



101 ఫైర్‌స్టేషన్ నెంబరు
108 వైద్య సహాయానికి టోల్‌ఫ్రీ నెంబరు

అగ్గిరేగితే.. ఆర్పేదెలా?

అరకొరగానే అగ్నిమాపక సేవలు



బాపట్ల అగ్నిమాపక కేంద్రంలోని ఫైరింజన్

ఆంధ్రజ్యోతి ఫోకస్

ప్రతిపాదనలకే పరిమితం

ప్రభుత్వ నిబంధనల మేరకు 50 వేల జనాభాకు ఒక శకటం అవసరం. అయితే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎక్కడా కూడా ఆ పరిస్థితి లేదు. పది పదిహేనేళ్ల క్రితమే అగ్నిమాపక కేంద్రాలతో పాటు, ఉన్న వాటిలో రెండో శకటం కోసం ప్రతిపాదనలు రూపొందించారు. అయితే ఏళ్లు గడుస్తున్నా కొత్తగా కేంద్రాల మంజూరును పక్కన పెడితే ఫైర్ ఇంజన్ల ఊసే లేదు. దీంతో వేసవిలో అత్యధిక ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో మంటల్లో ఆస్తులు మసవుతున్నాయి. ఆ సమయాల్లో నాయకులు, అధికారులు కంటి తుడుపు చర్యగా బాధితులకు సాయం అందించి చేతులు దులుపుకుంటున్నారే కానీ అగ్నిమాపక వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కనీస ప్రయత్నాలు చేయడంలేదు.

ఆస్తులు .. బూడిదే

ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే అగ్నిమాపక శకటం చేరేసరికి పూర్తి నష్టం వాటిల్లుతుంది. జిల్లాలో అనేక మండలాల్లో ఫైర్‌ఇంజన్ అందుబాటు లో లేదు. అగ్నిమాపక కేంద్రానికి సమా చారం అంది వారు అక్కడకు వెళ్లేప్పటికి మంటల్లో ఆస్తులు బూడిదగా మారుతున్నాయి. ఎక్కడైనా ఒకే సమయంలో రెండు ప్రాంతాల్లో మంటలు అంటుకుంటే ఒకటి పూర్తిగా నష్టపోవాల్సిన పరిస్థితి కూడా నెలకొంది.

సమర్థంగా ఎదుర్కొంటాం

జిల్లాలో ఎటువంటి అగ్ని ప్రమాదాలు, విపత్తులు సంభవించినా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొ నేందుకు సిద్ధంగా ఉన్నాం. కాల్ వచ్చిన కొన్ని నిమి షాల్లోనే ప్రమాదం జరిగిన ప్రాంతానికి అగ్నిమాపక వాహనాలు వెళ్లేలా ఏర్పాట్లు చేసుకున్నాం. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూసేందుకు అన్ని చర్యలు చేపట్టాం. ప్రజలు కూడా అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా ఉండరాదు.

- ముక్కు శ్రీనివాసరెడ్డి, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి, గుంటూరు

వేధిస్తోన్న సిబ్బంది కొరత

అగ్నిమాపక శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. ఒక్కో కేంద్రంలో లీడింగ్ ఫైర్‌మెన్లు ముగ్గురు, ఫైర్‌మెన్లు 9 మంది, డ్రైవర్లు ముగ్గురు, ఒక స్టేషన్ ఆఫీసరు ఉండా లి. అయితే ఏ స్టేషన్లోనూ 40 శాతం మంది సిబ్బంది కూడా లేరు. ఈ పరిస్థితుల్లో అగ్నిమాపకే కేంద్రానికి సమాచారం అందిస్తే.. అది చేరుకునేలోగా నష్టం జరిగి పోతుంది. ప్రమాద స్థలికి చేరుకోవడంలో కీలకంగా ఉండే డ్రైవర్లు ఏ స్టేషన్ లోనూ లేరంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. ఏళ్లుగా సిబ్బంది భర్తీకి నోచుకో లేదు. తాత్కాలిక ప్రాతిప దికన హోమ్ గార్డులను తీసుకున్నా వారికి పని నేర్పుకోలేక అధికారులు సతమత మవుతున్నారు.



● చీరాల అగ్నిమాపక కార్యాలయం

ఎండా కాలం.. అంటే మండే కాలం. అగ్ని ప్రమాదాలకు అత్యధికంగా అవకాశం ఉన్న సమయం. భానుడి భగభగలకు తోడు అగ్గి సులభంగా రేగుతుంటోంది. ఏటా అగ్ని ప్రమాదాల్లో రూ.కోట్ల లో ఆస్తి నష్టంతో పాటు ప్రాణాలు కూడా పోతుంటాయి. అగ్ని ప్రమాదాల నివారణకు అత్యాధునిక యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చిన వాటిని అందిపుచ్చుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది అనేందుకు జిల్లాలోని అగ్నిమాపక కేంద్రాల దుస్థితి చూస్తే అర్థమవుతోంది. అగ్గి రేగితే ఆస్తులు బుగ్గి అవుతున్నా.. అగ్నిమాపక వ్యవస్థను పటిష్ఠం చేయడంపై ప్రభుత్వం పెద్దగా దృష్టి సారించడం లేదనేందుకు సిబ్బంది, సౌకర్యాల కొరత, మరమ్మతులతో మొరాయించే ఫైర్‌ఇంజన్లు నిదర్శనంగా కనిపిస్తాయి. జిల్లా, మున్సిపల్ కేంద్రాలు తప్పించి మరెక్కడా కూడా అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. అవి కూడా అత్యాధునికంగా ఉన్నాయా అంటే అనుమానమే. ఎప్పుడో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రాలు.. ఏళ్ల క్రితం కేటాయించిన ఫైర్ ఇంజన్లతో అరకొర సేవలతో కాలం వెళ్లదీస్తున్నాయి. అగ్నిమాపక కేంద్రం పరిధిలో పదుల కిలోమీటర్ల దూరంలో జరిగే ప్రమాదాలకు వాహనాలు వెళ్లే సరికి ఆస్తులు బుగ్గవుతున్నాయంటే జిల్లాలో పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- మరమ్మతుల్లో పలు అగ్నిమాపక శకటాలు
- మండలాలకు సుదూరంలో అగ్నిమాపక కేంద్రాలు
- సకాలంలో ప్రమాదస్థలికి చేరుకోలేకపోతున్న ఫైర్‌ఇంజన్లు
- అగ్నిమాపకశాఖను వెంటాడుతున్న సిబ్బంది, సౌకర్యాల కొరత

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, మార్చి 9: వేసవి అగ్ని ప్రమాదాలకు అవకాశం ఎక్కువగా ఉండేకాలం. అయితే జిల్లాలో అగ్నిమాపకశాఖ పరిస్థితి అధ్వానంగా ఉంది. సిబ్బంది కొరత.. సౌకర్యాల లేమి.. డొక్కు వాహనాలతో అగ్ని ప్రమాదాలను వంద శాతం నివారించలేని విధంగా ఉంది. జిల్లాలోని పలు అగ్నిమాపక కేంద్రాల పరిధిలో పదుల సంఖ్యలో గ్రామాలున్నాయి. దీంతో ప్రమాదాల సమయంలో అగ్నిమాపక యంత్రం అక్కడకు వెళ్లే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. పలు కేంద్రాల్లో నీటి సౌకర్యం కూడా లేదు. దీంతో ప్రమాదం జరిగిందన్న సమాచారం వస్తే నీటి కోసం, డ్రైవర్ కోసం అన్వేషణ చేయాల్సిన పరిస్థితి ఉందంటే ఆశ్చర్యం కాదు. ప్రమాదాలకు, దూరాన్ని బట్టి అగ్నిమాపక కేంద్రాలు లేవు. ఏటా అగ్ని ప్రమాదాల్లో కోట్లాది రూపాయల ఆస్తులు బుగ్గిపాలవుతున్నా సమస్యలతో వెంటాడుతున్న అగ్నిమాపక శాఖ వాటిని కాపాడలేకపోతోంది. అత్యంత కీలకమైన అగ్నిమాపక శాఖను ప్రభుత్వం గాలికి వదిలేసిందని చెప్పవచ్చు. వాహనాల మరమ్మతులకు అగ్ని మాపక శాఖ నుంచి నిధులు విడుదల కావడం లేదు. జిల్లాలో ఏ మూల ఏ ప్రమాదం జరిగినా ఆ ప్రాంతానికి దగ్గరలో ఉన్న ఫైర్ ఇంజన్ వెళ్లడానికే చాలా సమయం పడుతోంది. తగినన్ని ఫైర్ స్టేషన్లు, వాహనాలు లేక, సిబ్బంది లేక ప్రజలను ప్రమాదాల నుంచి కాపాడాల్సిన అగ్నిమాపక శాఖే ప్రమాదంలో ఉంది. అత్యంత ప్రాధాన్యం కలిగిన అగ్ని మాపక శాఖపై పాలకులు అలసత్వాన్ని ప్రదర్శిస్తుండటంపై ప్రజలు ఆగ్రహిస్తున్నారు.

70 గ్రామాలకు ఒకే ఫైరింజన్

జిల్లా కేంద్రమైన బాపట్లలోని అగ్నిమాపక కేంద్రం పరిధిలో బాపట్ల పట్టణం, మండలం, కర్లపాలెం మండలం, కాకుమాను, పర్చూరు, చీరాల మండలాల పరిధిలోని కొన్ని చొప్పున మొత్తం 70 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో ఎక్కడైనా ప్రమాదం జరిగితే బాపట్ల నుంచి ఫైరింజన్ వెళ్లే సరికి ఆస్తులు కాలి బూడిదవుతున్నాయి. వేర్వేరు ప్రాంతాల్లో ఒకేసారి ప్రమాదాలు జరిగితే ఆ ఒక్క ఫైరింజన్ వెళ్లడం సాధ్యపడటంలేదు. జిల్లా కేంద్రం కాబట్టి మరొక ఫైరింజన్ ఏర్పాటు చేయాలని ఏళ్లగా ప్రతిపాదనలు ఉన్నాయి. దీనికి తోడు ఒక డ్రైవర్, రెండు ఫైర్మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

1 రేపల్లె నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు రేపల్లెలోని అగ్నిమాపక శకటం ఒకటే దిక్కు. రెండో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు ఏళ్లుగా అమలు కావడం లేదు. రేపల్లె మండలం లంకెవానిదిబ్బ, నగరం మండలం శిరిపూడి, చినమట్లపూడి, నిజాంపట్నం మండలం దిండి, అదవల, కొత్తపాలెం, భట్టిప్రోలు మండలం దోనేపూడి, వెల్లటూరు లంక గ్రామాలు అగ్ని మాపక శకటం చేరేందుకు గంటకు పైగా సమయం పడుతుంది. ఈలోగా నష్టం జరిగి బాధితులు నిరాశ్రయులుగా మారుతున్నారు. ఒకేసారి రెండు, మూడు ప్రమాదాలు సంభవించినప్పుడు పొన్నూరు, తెనాలి, కృష్ణాజిల్లా అవనిగడ్డ శకటాలపై కూడా ఆధారపడాల్సి వస్తుంది. 15 ఏళ్ల క్రితం చెరుకుపల్లిలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్న రూపొందించిన ప్రతిపాదనలు అమలు కాలేదు.

1 చినగంజాం, మార్టూరు, దేవినూతల, పర్చూరు మండలాల్లో ఎక్కడ ప్రమాదం జరిగినా చీరాల నుంచి అగ్నిమాపక వాహనం వెళ్లాల్సి వస్తోంది. చీరాల అగ్నిమాపక కేంద్రానికి వసతుల లేమి, సిబ్బంది కొరత ఉంది. కేంద్రంలో సౌకర్యాలు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

1 2013లో అద్దంకికి అగ్నిమాపక కేంద్రం మంజూరు కాగా తాత్కాలికంగా మార్కెట్ యార్డు ఆవరణలోని వరండాలో ఏర్పాటు చేశారు. అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి గొట్టిపాటి రవికుమార్ తన సొంత నిధులతో నిర్మించిన షెడ్డులోనే ఫైర్ ఇంజన్ ఉంది. దశాబ్దం దాటినా తాత్కాలిక వసతులే దిక్కు. శింగరకొండ రోడ్డు లో స్థలం కేటాయించినా నిధులు మంజూరు కాలేదు.





రేపల్లె అగ్నిమాపక కేంద్రం

మీ పంట.. ఈ-పంటలో ఉందా!

అభ్యంతరాలకు అవకాశం



ఈ-పంట నమోదు జాబితాను ప్రతి రైతు పరిశీలించవచ్చు. అందులో నమోదైన వివరాలు సక్రమంగా లేకపోతే అభ్యంతరం తెలపవచ్చు. అభ్యంతరాలు స్వీకరించి జాబితాను సరి చేస్తాం. రైతులు సాగు చేసే పంట వివరాలు ఈ-పంటలో నమోదు చేయించుకోవడం తప్పనిసరి. దానివల్ల విపత్తుల సమయంలో రైతులు పరిహారం అందుకోవచ్చు. - శ్రీనివాసరావు, ఏడీఏ, గుంటూరు

- రైతు సేవా కేంద్రాల్లో నేటి నుంచి సామాజిక తనిఖీ
- ముసాయిదా జాబితా తయారు చేసిన వ్యవసాయశాఖ
- తప్పులపై అభ్యంతరాలు స్వీకారం.. 22న తుది జాబితా విడుదల

(గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)

● గుంటూరు జిల్లా పెదనందిపాడుకు చెందిన రామారావు అనే రైతు పొగాకు సాగు చేశారు. ఈ-పంటలో శనగ అని నమోదైంది.

● పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం తాళ్ల చెరువుకు చెందిన హనుమంతరావు ఐదెకరాల్లో మిరప సాగు చేయగా రెండు ఎకరాల్లో మాత్రమే సాగు చేసినట్లు ఈ-పంటలో నమోదు చేశారు.

● బాపట్ల జిల్లా బాపట్ల మండలం కంకటపాలెంలో శ్రీనివాసరావు అనే రైతు పంట సాగు చేస్తే ఆ పొలం వెంకయ్య సాగులో ఉన్నట్లు నమోదైంది.

ఇలాంటి పొరపాట్లు వల్ల రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. విపత్తులు సంభవించినప్పుడు రైతులకు రావాల్సిన నష్ట పరిహారం, పంటల బీమా రాకుండా పోతుంది. ఈ పరిస్థితి నుంచి రైతులను తప్పించేందుకు వ్యవసాయ శాఖ రంగం సిద్ధం చేసింది. రబీలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించేందుకు ఏర్పాటు చేసింది. ఒక వేళ ఈ-పంటలో తప్పులు నమోదైతే అప్పటికప్పుడు వాటిని సరిదిద్దుకునే అవకాశం రైతులకు కల్పించారు. ఈ మేరకు వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 858 రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట నమోదు వివరాలు సోమవారం వెల్లడిస్తారు. ప్రతి రైతు తన పొలంలో సాగు చేసిన పంటను వ్యవసాయ సిబ్బంది సక్రమంగా నమోదు చేశారా.. లేదా అన్న విషయాన్ని పరిశీలించుకోవచ్చు. ఒక వేళ తప్పులు ఉంటే అక్కడికక్కడే అభ్యంతరం పత్రం అందజేయవచ్చు. వ్యవసాయ సిబ్బంది అభ్యంతరాలను సరిచేసి మండల అధికారులతో ఆమోదింపచేస్తారు. తహసీల్దారు, వ్యవసాయ శాఖాధికారి ఆమోదించిన తుది జాబితాను ఈ నెల 22న రైతు సేవా కేంద్రాల్లో వెల్లడిస్తారు.



అంతా తప్పుల తడకలే...

ఈ-పంట నమోదు ప్రక్రియ 2016 నుంచి జరుగుతుంది. వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పొలంలోకి వెళ్లి రైతు ఏ పంట వేశారో పరిశీలించి ఈ-పంటలో నమోదు చేయాలి. ఆ తర్వాత గ్రామసభ నిర్వహించి జాబితాలను ప్రదర్శించాలి. అయితే గత జగన్ ప్రభుత్వ హయాంలో గ్రామ సభలు జరగలేదు. వ్యవసాయ సిబ్బంది కార్యాలయంలో కూర్చుని ఏదో ఒక పంటను నమోదు చేశారు. జియో ట్యాగింగ్‌ను కూడా ఫార్స్‌గా మార్చారు. రెవెన్యూ సిబ్బంది అసలు ఈ ప్రక్రియలోనే పాల్గొనలేదు. ఫలితంగా ప్రకృతి విపత్తుల కాలంలో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. జగన్ ప్రభుత్వ నిర్వాకంపై కేంద్ర వ్యవసాయ శాఖకు ఫిర్యాదులు కూడా వెళ్లాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలో ప్రస్తుతం వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తమై గతంలోలా తప్పులు దొర్లకుండా వాటిని సరి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసి అమలుకు రంగంలోకి దిగారు. సామాజిక తనిఖీ జరిగితేనే లోటుపాట్లు వెలుగులోకి వస్తాయన్న ఆలోచనతో రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట జాబితాలు ప్రదర్శించే ఏర్పాటు చేశారు.

అన్ని వసతులతో పాలిటెక్నిక్ కళాశాల

1 రూ.కోటి సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధికి చర్యలు

1 రూ.8 కోట్లతో భవనాల ప్రారంభోత్సవంలో మంత్రి అనగాని

రేపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు దోహదపడే విధంగా అన్నిరకాల మౌలిక వసతులను కల్పిస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. పట్టణంలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో రూ.8 కోట్లతో నిర్మించిన పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ కళాశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలలో మిగిలిన అవసరాల కోసం కోటి రూపాయలు అవసరం ఉందని, ఆ మేరకు సీఎస్ఆర్ నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. కీలకదశలో ఉన్న విద్యార్థులు ఇప్పుడే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికి విద్యారంగానికి అవసరమైన నిధులను కేటాయిస్తున్నామన్నారు. ఎంతో కష్టపడి నిధులు తీసుకువచ్చి అన్ని హంగులతో కళాశాల భవనాన్ని నిర్మించామని ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ విద్యార్థుల అభ్యున్నతికోసం పని చేయాలన్నారు. ప్రారంభోత్సవానికి ప్రిన్సిపాల్ నుంచి ఆహ్వానం అందలేదని ముందుగా తెలిపి ఉంటే మంత్రులను తీసుకుని వచ్చి మరిన్ని నిధులు మంజూరుచేయించి కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకుని ఉండేవాడినన్నారు. రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ వి.పద్మారావు, ఆర్‌జేడీ నిర్మలాకుమారిప్రియ, జాయింట్ డైరెక్టర్ కె.విజయభాస్కర్, ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కట్టా మంగ, కమిషనర్ కె.సాంబశివరావు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.22 (సోమవారం)
సహరి : 5.03 (మంగళవారం)



పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

శింగరకొండలో ముమ్మర ఏర్పాట్లు

14న జరిగే తిరునాళ్లకు 4 విద్యుత్ ప్రభలు

అద్దంకి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ 70వ వార్షిక తిరునాళ్లకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. 14న జరిగే ప్రధాన తిరునాళ్లకు తరలి వచ్చే భక్తులకు అన్నదానం చేసేందుకు అన్ని సామాజిక సత్రాలలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడంలో ఆలయ అధికారులు నిమగ్నమయ్యారు. తిరునాళ్లకు కేవలం నాలుగు విద్యుత్ ప్రభలు మాత్రమే ఏర్పాటు చేసే అవకాశం కనిపిస్తుంది. శింగరకొండపాలెం నుంచి ఒకటి, అద్దంకి నుంచి మూడు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయనున్నారు. ప్రభల ఏర్పాటుకు సంబంధించి వైసీపీ నేతలు వెనుకడుగు వేయడంతో కేడర్ ఒకింత నిరుత్సాహానికి గురైంది. దీంతో విద్యుత్ ప్రభల వెలుగులతో వెలుగులీనాల్సిన శింగరకొండ ప్రాంతం 4 విద్యుత్ ప్రభలకే పరిమితమవుతం కానున్నది. గత ఏడాది ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఒకే ఒక్క విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కూడా అంతంత మాత్రంగానే ప్రభలు ఏర్పాటుతో భక్తులు నిరుత్సాహానికి గురవుతున్నారు.



శింగరకొండ తిరునాళ్లకు ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు, జెయింట్ వీల్

పారిశుధ్యంపై నిర్లక్ష్యం

- పెరుగుతున్న ఆక్రమణలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



శిథిలావస్థకు చేరిన కరెంట్ స్తంభం చుట్టూ ఉన్న చెత్త

ఈపూరుపాలెం(చీరాల), మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం ఈపూరుపాలెంలో చెత్త సేకరణపై అధికారుల్లో చిత్తశుద్ధిలేదని ప్రజలు వాపోతున్నారు. ప్రధాన మార్గాల్లో మినహాయించి అంతర్గత రహదారుల్లో చెత్త సేకరణ పారదర్శకత లేదని చెప్తున్నారు. ఈక్రమంలో ఆయామార్గాల్లో చెత్త పేరుకు పోయి దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. అంతేకాకుండా రహదారుల్లో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు భూమి మట్టంలో చాలాభాగం దెబ్బతిన్నాయి. దీంతో ఏక్షణంలోనైనా పోల్స్ నేలవాలొచ్చు. ప్రజలు కూడా చెత్తను పూర్తిగా స్థంభం మొదల్లో వేస్తున్నారు. ఇదిలావుంటే రహదారుల వెంబడి గృహయజమానులు నివాసాల్లోని వ్యర్థజలాలను స్వేచ్ఛగా రోడ్లపైకి వదులుతున్నారు. ఈక్రమంలో కొన్నిచోట్ల కాలువల్లా మారి ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. అంతేకాకుండా రోడ్లపైకి నిర్మాణాలు, లేక వివిధ రకాల వస్తువులను ఉంచి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈక్రమంలో అధికారులు అటువైపు కన్నెత్తి చూడాలి. లేకుంటే ప్రభుత్వ ఆస్తులకు ఆటంకం తప్పదు.

వామ్మో కొప్పెరపాడు - పంగులూరు రోడ్డు

- కంకర పరిచి తారు వేయని ఆర్అండ్బీ శాఖ
- రాకపోకలు సాగించ లేక ఇబ్బందులు పడుతుతున్న ప్రయాణికులు, ప్రజలు



పంగులూరు-తూర్పు కొప్పెరపాడు మధ్య కంకర పరిచి వదిలేసిన ఆర్అండ్బీ రోడ్డు

పంగులూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు మరమ్మతు పనులు అర్థంతరంగా నిలిచి పోవడంతో రాకపోకలు సాగించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తూర్పు కొప్పెరపాడు, పంగులూరు గ్రామాల మధ్య ఈ దుస్థితి నెలకుంది. మండలంలో ఛిద్రమైన ప్రధాన రహదారులలో రోడ్ల మరమ్మత్తు పనులకు కొద్ది నెలల కిందట ఆర్ అండ్ బీ అధికారులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో శ్రీకారం చుట్టారు. మండల కేంద్రమైన పంగులూరు నుంచి ముప్పవరం చేరుకునే ప్రధాన రహదారి మరమ్మతు పనులను ఎట్టకేలకు పూర్తి చేసిన అధికారులు కొప్పెరపాడు, పంగులూరు గ్రామాల మధ్య నెలల తరబడి నిలిచిన పనుల వైపు దృష్టి సారించలేదు. ఈ రెండు గ్రామాల మధ్య ఆర్ అండ్ బీ రోడ్డు పలుచోట్ల పూర్తిగా దెబ్బతినడంతో మరమ్మతు పనులు ప్రారంభించారు. ఛిద్రమైన రోడ్డును ఎక్స్‌కవేటర్‌తో చదును చేసి కంకర పరిచారు. కంకర పరిచి నెలలు గడుస్తున్నా దానిపై తారు వేసే ప్రయత్నం చేయక పోవడంతో రెండు గ్రామాల మధ్య ప్రయాణం సాగించలేక ప్రజలు నరకం చూస్తున్నారు. వామ్మో ఆ రోడ్డుపై ఎలా వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల ఒకటవ తేదీన మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముప్పవరం పార్టీ కార్యాలయంలో సమస్యలపై సమీక్ష చేపట్టిన సమయంలో రెండు గ్రామాల రైతులు నిలిచిన రోడ్డు మరమ్మతు పనులతో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని మంత్రికి వివరించారు. ఈ విషయమై మంత్రి గొట్టిపాటి పనులు వుగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారుల అలసత్వమో, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో తెలియదుగాని నిలిచిన పనులు ముందుకు సాగడం లేదు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

వ్యవసాయ పనులు ముమ్మరం కావడంతో రెండు గ్రామాల రైతులు, కూలీలు పనుల నిమిత్తం పొలాలకు చేరేందుకు అవస్థలు పడుతున్నారు. బర్లీ పొగాకు వొలవడం, వొలిచిన ఆకులను కూర్చడంతోపాటు శనగ కోతలు ప్రారంభం కావడంతో వందల సంఖ్యలో కూలీలను పొలాలకు తరలించాల్సి ఉంది. అయితే కంకర రోడ్డుపై కూలీలను ఆటోలు, ట్రాక్టర్లపై చేరవేయడం, ద్విచక్రవాహనాలపై పొలాలకు రాకపోకలు సాగించడం కష్టంగా ఉందని రైతులు వాపోతున్నారు. పలు పనుల నిమిత్తం మండలానికి చేరుకునే ప్రజలు, నిత్యం పనుల నిమిత్తం పొలాలకు రాకపోకలు సాగించే రైతులు, కూలీలు చెల్లా చెదురుగా వెగిసి పడుతున్న పొడిబారిన కంకరపై ప్రయాణం సాగిస్తూ ప్రమాదాలబారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మరమ్మతు పనులు వేగంగా పూర్తి చేసి తమ కష్టాలు తొలగించాలని సంబంధిత అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న పూర్వ విద్యార్థులు

53 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక

- 1969- 71లో బీకాం చదివిన పూర్వవిద్యార్థుల సమావేశం
- గురువులకు ఘన సత్కారం

బల్లికురవ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా తాము ఒకప్పుడు విద్యార్థులమేనని, 53 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని సంతోషంగా నిర్వహించారు. మండలంలోని కొండాయపాలెం గ్రామంలో ఆదివారం 1969-1971లో చిలకలూరిపేట చుండి రంగనాయకులు కాలేజీలో బీకాం చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కొండాయపాలెంకు చెందిన పూర్వ విద్యార్థి కక్కెర ఆంజనేయులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాలేజీలో గడిపిన రోజుల్లో ఉన్న మిత్రులందరినీ ఒక చోటకి చేర్చి యోగ క్షేమాలను ఒకరినొకరు అడిగి తెలుసుకొన్నారు. 50 మంది వరకు పూర్వ విద్యార్థులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా గురువులు చంద్రశేఖర్‌రావు, విజయభాస్కర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రానైట్ లారీల సమస్యపై వినతి

చర్యలకు ఆదేశించిన మంత్రి గొట్టిపాటి

బల్లికురవ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ ముడి రాయి రవాణ చేసే సమయంలో మైనర్లు లారీలను నడుపుతున్నారని రాత్రుళ్లు వారు ఇష్టానుసారంగా హారన్ కొడుతూ ఇబ్బంది పెడుతున్నారని నక్కబొక్కలపాడు ప్రజలు ఆదివారం మంత్రి రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. అనుభవంలేని డ్రైవర్లతో మాగ్రామం మీదుగా వెళుతున్న ముడిరాయి లారీలను చూస్తే భయమేస్తుందని, వెంటనే కట్టడి చర్యలు చేపట్టాలని మంత్రికి విన్నవించారు. వెంటనే మంత్రి సంతమాగులూరు సీఐ వెంకట్రావును లారీల యజమానులను పిలిచి వారితో సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా రాళ్లను రవాణా చేసే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సంఘ సంస్కర్త కాళ్లకూరి



కళాకారులను సత్కరిస్తున్న సృజన బృందం

అద్దంకిటౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : చింతామణి నాటకం రాయడంలోను, ఆకాలంలో వేశ్యల సమస్యలని, వేశ్య స్త్రీలు గౌరవంగా జీవించడానికి, సమాజం అభ్యున్నతి చెందడానికి ఆకాంక్షించిన ప్రముఖ సంఘ సంస్కర్త, నాటక కర్త కాళ్లకూరి నారాయణరావు ఒకరని కంభంకు చెందిన సాహిత్యవేత్త పాపిశెట్టి శశి కుమార్ అన్నారు. ఆదివారం అద్దంకిలోని కమలేశ్వర స్వామి ఆలయంలో సృజన సాహిత్య సమావేశం డాక్టర్ దేవపాలన అధ్యక్షన జరిగింది. ఈ సందర్భంగా అతిథిగా హాజరైన శశికుమార్ చింతామణి నాటకం - కళ్లకూరివారి సందేశం అనే అంశంపై ఉపన్యసించారు. ఈ సందర్భంగా అద్దంకికి చెందన మహానటులు అద్దంకి శ్రీరామమూర్తి, మాణిక్యాలరావు, బండారు రామారావు, పుట్టంరాజు శంకరరావు తమ నటనతో పద్య ఆలాపనతో ప్రేక్షకుల హృదయాలను దోచుకున్నారని సృజన అధ్యక్షుడు దివాకర్ దత్తు, షేక్ మహమ్మద్ రఫీ అన్నారు. నేటి కళారత్నాలు మిద్దెబోయిన అంజనేయరాజు, తన్నీరు నాగేశ్వరరావు, ఆలకుంట శ్రీనివాసరావు, గోవాడ శ్రీకాంత్ అద్భుతమైన నటనతో ప్రజల హృదయాలలో జీవిస్తున్నారి పుట్టంరాజు శ్రీరామమూర్తితో పాటు పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా నేటి కళాకారులను సృజన బృందం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో వీరవల్లి సుబ్బారావు, శ్రీనివాసరావు, లేవి ప్రసాద్, వీరయ్య, జ్యోతిష్మతి, వరలక్ష్మి, భువనేశ్వరి, సుబ్రమ్మణ్యం జ్యోతిచంద్రమౌళి, మస్తాన్, అంజాద్ బాషా పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆత్మహత్యాయత్నం

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : హెల్త్ ఆఫీసర్ ఆత్మహత్యాయత్నం కలకలం సృష్టించింది. యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి జాగర్లమూడి హెల్త్ క్లినిక్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పీ సరోజిని వైద్యాధికారి శ్రీహర్ష వేధింపుల కారణంగా శనివారం ఎలుకలు మందు త్రాగి ఆత్మ హత్యకు పాల్పడినట్లు ఆదివారం కుటుంబసభ్యులు తెలిపారు. విధుల సమయంలో కావాలనే వైద్యాధికారి శ్రీహర్ష మాటలతో మానసికంగా వేధించారని, 3 నెలల జీతాల బిల్లులు కూడా పెట్టలేదని తీవ్ర ఇబ్బందులు పడుతూ దాంతో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిందని, ప్రస్తుతం గుంటూరు లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ విషయమై వైద్యాధికారి శ్రీహర్షను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఆమె విధులకు సక్రమంగా హాజరుకాదని,గత ఏడాది నవంబరులో ఈ విషయమై డీఎంహెచ్‌వోకు నోటీసు ఇచ్చినట్లు చెప్పారు. అలాగే డిసెంబరులో రీజనల్ డైరెక్టర్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ షోకాజ్ నోటీసు కూడా జారీ చేశారన్నారు. ఆమెకు 3 నెలలుగా జీతాలు నిలిపివేయడం తన పరిధిలో లేదన్నారు.

బూదవాడకు బస్ సౌకర్యం కల్పించండి

డీఎంకు మంత్రి గొట్టిపాటి ఆదేశం

పంగులూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూదవాడ గ్రామానికి బస్ సౌకర్యం కల్పించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకి డిపో మేనేజర్‌ను ఆదేశించారు. అద్దంకి నుంచి పంగులూరు, చిన మల్లవరం, గ్రామాలను కలుపుతూ ఇంకొల్లుకు బస్ సౌకర్యం కల్పించాలని, ఆరికట్లవారిపాలెం గ్రామం నుంచి బూదవాడ వరకు బీటీ రోడ్డును నిర్మించాలని బూదవాడ గ్రామ నేతలు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి మంత్రికి విజ్ఞప్తి చేశారు. రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. చిన మల్లవరంలో నిర్మితమవుతున్న ధ్యాన మందిర పనులకు నిధులు సమకూర్చాలని గ్రామ మహిళలు మంత్రి రవికుమార్‌ను కోరగా సానుకూలంగా స్పందించారు. రోడ్ల విషయమై మాట్లాడుతూ ప్రస్తుతం బీటీ రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు జరుగుతున్నాయని, ఈ పనులు పూర్తయిన అనంతరం బీటీ రోడ్ల నూతన నిర్మాణ పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపడతామన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫాంల చోరీ విషయమై అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి గొట్టిపాటి కాపర్ వైరు కొనుగోలు దారులపై కేసులు నమోదు చేయాలన్నారు. వీరి వెంట రావూరి రమేష్, కేవీ సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, మస్తాన్‌వలి, వెంకటేశ్వర్లు, చింతల సహదేవుడు, బ్రహ్మానందస్వామి, వరపర్ల సుబ్బారావు, విద్యుత్ శాఖ ఏఈ అనిల్‌కుమార్, భాను ప్రకాష్, చౌదరిబాబు, కాజా కార్యక్రమంలో పాల్గొన్నారు.



సామ్రాజ్యం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి

బాధిత కుటుంబాలకు పరామర్శ

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పంగులూరు మండలంలో పర్యటించారు. పలు గ్రామాలలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. ముప్పవరంలో ఆదివారం జరిగిన పుచ్చకాయల సామ్రాజ్యం దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో మృతి చెందిన పోలిశెట్టి రాములు మృతదేహానికి నివాళులర్పించారు. ఉదయగిరి హనుమంతరావు మాతృమూర్తి రుక్మిణమ్మ ఇటీవల మరణించగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. పాముకాటుతో మృతి చెందిన ఇంటూరి చిన సిద్ధయ్య చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇదే గ్రామానికి చెందిన తోట నాగేశ్వరరావు మాతృమూర్తి మహాలక్ష్మమ్మ మృతి చెందగా, కుటుంబ సభ్యులను పరామర్శించారు. చినమల్లవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న పొనుగుపాటి హనుమంతరావు నివాసానికి వెళ్లిన గొట్టిపాటి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఇటీవల మృతి చెందిన వెలటూరి రామ్మోహనరావు చిత్రపటానికి పూల నివాళులర్పించారు. బూదవాడలో అనారోగ్యంతో మృతిచెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు తేళ్ల ఐసన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రేణంగివరంలో మృతి చెందిన సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనవెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

బల్లికురవ : పలు గ్రామాలలో ఇటీవల మృతి చెందిన అనార్యోగంబారిన పడిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పరామర్శించారు. మండలంలోని అంబడిపూడి బీసీ1 కాలనీకి చెందిన కార్యకర్త కోవూరి రాజాదిరాజ గుండుపోటుతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని, పెదసింగమ్మ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నక్కబొక్కలపాడులో రోడ్డు ప్రమాదానికి గురైన కోటేశ్వరరావును, శస్త్రచికిత్స చేయించుకున్న వెంకటేశ్వర్లును, ఇటీవల మృతి చెందిన దర్శి శారద కుటుంబ సభ్యులను గొట్టిపాటి పరామర్శించారు.



నామ్ రోడ్డులో సెంటర్ లైటింగ్ లైట్లు మరమ్మతులు చేస్తున్నసిబ్బంది

సెంట్రల్ లైటింగ్ లైట్లకు మరమ్మతులు

అద్దంకి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నామ్ రోడ్డులో అద్దంకి పట్టణం పరిధిలో నల్లవాగు వద్ద నుంచి శింగరకొండ 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వరకు ఉన్న సెంటర్ లైటింగ్ లైట్లు సుమారు 50కి పైగా మరమ్మతులకు గురి కావడంతో మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు ఆదివారం నాటికి పూర్తి చేశారు. శింగరకొండ 70వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం జరగనున్న నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అద్దంకి మున్సిపల్ అధికారులు లైట్లు మరమ్మతులను చేపట్టారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా కొల్లా



పర్చూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు కోర్టు భవనాల సముదాయ సీనియర్, జూనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా కొల్లా నరేంద్రకుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు అద్దంకి కోర్టులో ఏజీపీగా విధులు నిర్వహిస్తున్న వై.రమేష్‌బాబు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో పర్చూరు కోర్టులో సీనియర్ న్యాయవాదిగా ఉన్న కొల్లాను ఏజీపీగా నియమిస్తూ బాపట్ల కలెక్టర్ వెంకట మురళి ఉత్తర్వులు జారీ చేశారు. ఏజీపీగా నియమితులైన కొల్లాకు పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఉన్న అన్ని మతాలకు సంబంధించిన దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మండలం తోటవారిపాలెం వీవర్స్‌కాలనీలో భద్రావతి సమేత భావనాఋషి స్వామివారి నూతన దేవస్థాన, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈసందర్భంగా కమిటీ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కావూరివారిపాలెంలో అంకమ్మతల్లి పోతురాజు స్వామి వార్ల విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు దేవస్థాన కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో మంత్రి గొట్టిపాటి ప్రత్యేక పూజలు

అద్దంకి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆదివారం శ్రీశైలంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం వారిని వేదపండితులు ఆశీర్వదించగా, ఈవో ఎం.శ్రీనివాసరావు సత్కరించి స్వామి వార్ల ఫొటోను అందజేశారు.

జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చినగంజాం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడ గ్రామంలో ఈ నెల 14వ తేదీన జరగనున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లోని జనసేన మండల పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తుమ్మలపెంట సతీష్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి కుర్రి వాసు, నాయకులు గంటా వెంకటేష్, బొప్పన శ్రీను, టి.ఆదినారాయణ, నరహరి గోపి, సాయి, పెదసింగు వెంకటేష్, జాలిరెడ్డి, గిరిష్‌రెడ్డి పాల్గొన్నారు.

కాటాలలో మోసం చేస్తే చర్యలు

మూడు గ్రామాలలో 18 మందిపై కేసులు

బల్లికురవ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కాటాలలో ప్రజలను వ్యాపారులు మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవు అని చీరాల తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం బల్లికురవ మండల కేంద్రంలోని పలు చికెన్ దుకాణాలను ఆయన తనిఖీ చేసి కేసులు నమోదు చేశారు. ముక్తేశ్వరంలో రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తూ కాటాలలో అవకతవకలకు పాల్పడ్డారని ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్త మేరకు గ్రామంలో కాటాలను పరిశీలించారు. ఎవరైనా రైతులను మోసం చేస్తే కేసులు తప్పవన్నారు. అనంతరం ఆయన వైదన, కొప్పెరపాడు గ్రామాలలోని చికెన్ దుకాణాలు, కూల్ డ్రింక్స్ షాపులను తనిఖీ చేశారు. మొత్తం 18 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఎమ్మార్పీ ధరకు మించి విక్రయాలు చేస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు.



వెంకటరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

గుండెపోటుతో టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

పలువురు దిగ్ర్భాంతి

చీరాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల టీడీపీ సీనియర్ నాయకుడు పులి వెంకటరావు (50) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన వెంకటరావు రాజకీయం రంగప్రవేశం చేసిన నాటి నుంచి సుదీర్ఘంగా టీడీపీకి కట్టుబడి పని చేశారు. ఎన్నో ఒడిదొడుకులు ఎదురైనప్పటికీ పార్టీని అంటిపెట్టుకునే కార్యక్రమాల్లో ముందుండేవారు. అక్కయ్యపాలెం లిఫ్ట్ఇగేషన్‌కు అధ్యక్షుడిగా కూడా పని చేశారు. వెంకటరావు భార్య, పాప, బాబు సంతానం. ఈక్రమంలో ఆయన మృతిపై పలువురు దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. పార్టీకు, కుటుంబానికి తీరని లోటని వివరించారు. ఎమ్మెల్యే కొండయ్య ఉన్నపళంగా అన్ని కార్యక్రమాలు నిలిపివేసి వెంకటరావు నివాసానికి చేరుకుని నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అండగా ఉంటామన్నారు. నేడు పార్టీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు జరుగనున్నాయి.

ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసిన జగన్‌రెడ్డి

మంత్రి గొట్టిపాటి

అద్దంకి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యశ్రీ పథకాన్ని వైసీపీ ప్రభుత్వంలో జగన్‌రెడ్డి పూర్తిగా నిర్వీర్యం చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేశారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న 11 మందికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.24,02,826 చెక్కులను, వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తక్షణ వైద్య సహాయం అవసరమైన ఐదుగురికి రూ.5,42,079 ఎల్‌వోసీ పత్రాలను మంత్రి ఆదివారం చిలకలూరిపేటలోని కార్యలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కంకణం

అద్దంకి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో ముద్రించిన రంజాన్ పాకెట్ క్యాలెండర్‌ను ఆదివారం అద్దంకిలో గొట్టిపాటి రవికుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమానికి సీఎం చంద్రబాబు సారధ్యంలో కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దఎత్తున నిధులు కేటాయించిందన్నారు. సబ్ ప్లాన్ అమలు ద్వారా మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. వైసీపీ నిలిపివేసిన పథకాలను పునరుద్ధరించడం జరిగిం దన్నారు. కార్యక్రమంలో ఐటీడీపీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, బడావలి, మాలిక్, మాబు, మీరావలి, రసూల్, ఖాదర్‌బాషా, జబ్బార్, రఫీ, ముస్తాఫా, మస్తాన్, పాంటింగ్, హుస్సేన్ పాల్గొన్నారు.

శింగరకొండ అన్నదానానికివంట సామగ్రి అందజేత

అద్దంకి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం అన్నదానం వంటకు అవసరమైన 50 వేల రూపాయల విలువైన వంట సామగ్రిని నర్సరావుపేట మండలం రావిపాడుకు చెందిన మల్లవరపు శవరయ్య, అన్నమ్మ జ్ఞాపకార్థం కుమార్తె విజయనిర్మల, మనవడు బాల మణితేజ ఆదివారం ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు.

మద్యం అక్రమ విక్రయాలపై దాడులు

రామాపురం(చీరాల), మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం నిల్వలు చేసిన విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. అందిన సమాచారం మేరకు ఆదివారం రామాపురం రోడ్డులోని వాయిల రాంబాబు దుకాణంలో దాడులు నిర్వహించారు. 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. నిరంతరం దాడులు జరుగుతాయని ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

లారీని ఢీకొని ద్విచక్రవాహనదారుడికి గాయాలు

మార్టూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులో హీరో షోరూం నుంచి జొన్నతాళికి వెళ్లే సర్వీసు రోడ్‌లో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి టీవీఎస్ వాహనదారుడు పల్లెపోగు వీరయ్య ఢీకొన్న ఘటన ఆదివారం జరిగింది. ఈ ప్రమాదంలో వీరయ్యకు గాయాలు కాగా, 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యద్దనపూడి గ్రామానికి చెందిన వీరయ్య కొంతకాలం నుంచి జొన్నతాళి గ్రామంలో నివాసం ఉంటున్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం మార్టూరు వచ్చి మరలా జొన్నతాళి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.



మున్సిపాలిటీల ఎన్నో ఏళ్ల కల కూటమి ప్రభుత్వంతో సాకారమయ్యింది. పురపాలకశాఖ మంత్రి నారాయణ కృషితో రాష్ట్రంలోని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలకు ఆర్థిక స్వాతంత్ర్యం లభించింది. ఇకపై చెత్త తొలగించాలన్నా, నీటి కుళాయి రిపేరు చేయాలన్నా, వీధి లైటు వేయాలన్నా, రోడ్లపై గుంతలు పూడ్చాలన్నా...! నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వైపు చూసే దయనీయ పరిస్థితి తప్పింది. బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ వేగవంతంగా జరగడమే కాకుండా కట్టడాల కట్లు తప్పకుండా కళ్లెం వేసే కొత్త చట్టం కూడా అమలులోకి వచ్చింది. నారాయణ సుదీర్ఘకాల విన్నపానికి కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో భవిష్యత్తులో మున్సిపాలిటీలకు ఆర్థిక కష్టాలు తీరనున్నాయి. మున్సి పాలిటీలు తమ ఆదాయాన్ని తమ అవసరాలకు నేరుగా ఖర్చు చేసుకునే అవకాశం లభించింది.



మున్సిపాలిటీలకు ఆర్థిక స్వేచ్ఛ!

- స్థానిక సంస్థల నిధులు ఇక వాటివద్దే..!
- అవసరాలకు ఖర్చు చేసుకునే అధికారమూ దఖలు
- భవన నిర్మాణ అనుమతులూ వాటికే..
- మంత్రి నారాయణ కృషితో ప్రభుత్వ నిర్ణయం

నెల్లూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత పదేళ్లగా మున్సిపాలిటీల ఆదాయంలో ప్రతిపైసా సీజేఎఫ్ఎస్‌లో జమచేస్తున్నారు. స్థానిక అవసరాలకు నిధులు రాబట్టుకోవడం అనేది సీజేఎఫ్ఎస్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండేది. ఈ క్రమంలో మున్సిపాలిటీ ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకొని ఎప్పుడో బుద్ధిపుట్టినప్పుడు మున్సిపాలిటీలకు బదిలీ చేసేది. తమ అవసరాల కోసం ఖర్చు చేసుకున్న నిధులను తమ ఆదాయం నుంచి విడుదల చేయాలని మున్సిపాలిటీలు రెండేళ్ల క్రితం పెట్టుకున్న బిల్లులకు కూడా ఇప్పటి వరకు మోక్షం లేదంటే నిధుల విడుదల ఎంత ఘోరంగా ఉండేదో, మున్సిపాలిటీలు ఎంత ఆర్థిక సంక్షోభాన్ని అనుభవించేవో అర్థం అవుతుంది. 2014-19లో మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేసిన పొంగూరు నారాయణ ఈ పద్ధతిని మార్చేందుకు ప్రయత్నించారు. మున్సిపాలిటీలకు ఎన్నో అవసరాలు ఉంటాయి, వారి నిధులు వారివద్దే ఉంచాలనే ప్రతిపాదనను ప్రభుత్వం ముందుకు బలంగా తీసుకొచ్చారు. అయితే అప్పటికే ఎన్నికల సమయం దగ్గరపడటంతో ఈ ప్రతిపాదనలు మూలన పడ్డాయి. దీంతో గత ఐదేళ్ల పాత పద్ధతే కొన సాగింది. పన్నుల రూపంలో వచ్చిన మున్సిపాలిటీల ఆదాయాన్ని వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకోవడంతో గడచిన ఐదేళ్లు పురపాలికలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. మున్సిపాలిటీలలో పనులు చేస్తే బిల్లులు ఎప్పటికి వస్తాయో గ్యారెంటీ లేకపోవడంతో టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేవారు కారు. ఈ కారణంగానే జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో గత ఐదేళ్ల కాలంలో రోడ్లపై ఏర్పడిన గుంతలను కూడా పూడ్చలేకపోయారు.

అసెంబ్లీ ఆమోదంతో...

ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మళ్లీ మున్సిపల్ శాఖ మంత్రిగా నారాయణ బాధ్యతలు చేపట్టడంతో ఆయన పాత ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపాలిటీలు బాగుపడాలంటే వాటికి ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం అని, వాటి ఆదాయాన్ని వాటి వద్దే ఉంచాలని ఆయన కూటమి ప్రభుత్వ పెద్దలను ఒప్పించగలిగారు. దీంతో మున్సిపాలిటీలకు ఆర్థిక స్వాతంత్ర్యం బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందింది. మున్సిపాలిటీలకు ఈ ఆర్థిక సంవత్సరం నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం స్థానిక సంస్థల వద్దే ఉంటుంది. అవసరాలకు ఖర్చు చేసుకునే అధికారం వారికి ఉంటుంది.

ప్లాన్ అప్రూవల్ సరళతరం

ఈ కొత్త బిల్లులో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌ను కూడా సరళతరం చేయడంతోపాటు ఉల్లంఘనలు జరిగితే చర్యలు తీసుకోవడానికి వీలుగా చట్టం చేశారు. ఇప్పటి వరకు మున్సిపాలిటీల్లో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి పంపేవారు. ఇప్పుడు దానిని రద్దు చేశారు. మున్సిపాలిటీలే నేరుగా అప్రూవల్ ఇచ్చే వెసులుబాటు కల్పించారు. దీనివల్ల అప్రూవల్స్ వేగవంతం అవుతాయి. అలాగే ప్లాన్ ఉల్లంఘించి నిర్మాణాలు జరిగితే వాటిని కూల్చే అధికారం కూడా మున్సిపాలిటీలకు ఇచ్చారు. అందుకు అంగీకరిస్తూ భవన యజమాని అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుంది. దీనివల్ల నిర్మాణాల్లో ఉల్లంఘనలు చాలా వరకు కట్టడి కానున్నాయి.

రంగడి బ్రహ్మోత్సవాలకు
వైభవంగా అంకురార్పణ


అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు


ప్రత్యేక అలంకరణలో రంగనాథస్వామి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని తల్పగిరి రంగ నాథస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అంకురార్పణ పూజలు, పుణ్యాహవచనం, విష్వక్సేనారాధన, మృత్యసం గ్రహణం, స్వామివారి ఉత్సవ మూర్తులకు రక్షాబంధనం, సోమ కుంభ ప్రతిష్ఠ, గరుడ ధ్వజ పతిష్ఠ, హోమాలు జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉభయకర్త ఆనం గోపాల కృష్ణారెడ్డి, కుటుంబ సభ్యులు, ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు
ఘనంగా ప్రారంభం

- గిరిప్రదక్షిణకు భారీగా తరలివచ్చిన భక్తులు
- దేవతామూర్తుల వేషధారణలు, కోలాటాలు, భజనలతో సందడి


ఆలయం నుంచి గిరిప్రదక్షిణకు బయలుదేరి స్వామి,అమ్మవార్లు

బిట్రగుంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండ బిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసి ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలో భాగంగా ఆదివారం ఉదయం గిరిప్రదక్షిణ వైభవంగా జరిగింది. ఆలయంలోని ప్రధాన అలంకార మండపంలో గిరిప్రదక్షిణకు ముస్తాబైన స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని, ఆనంద పరవసులయ్యారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారు ఉత్తరద్వారం నుంచి దిగువ మండపానికి చేరు కున్నాక అర్చకులు సత్యనారాయణచార్యులు మంగళహారతులు అందచేశారు. గోద ర్శనం అనంతరం గిరిప్రదక్షిణ ప్రారంభ మైంది. ఈ కార్యక్రమంలో చిన్నా రుల దేవతామూర్తుల వేషధారణ, భరత నాట్యం, కోలాట నృత్యాలు, భజనలు భక్తులను అలరించాయి. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దంప తులు, ఆర్డీవో వంశీకృష్ణ తదితరులు ఈ సందర్భంగా కోలాటం ఆడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజకుమార్, నాగేశ్వరావు, కావలి ఏఎంసీ మాజీ ఛైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం దంపతులు, బీజేపీ నేత భరత్‌కుమార్ యాదవ్, ఎన్ఎస్‌యాదవ్ దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం భూమి పూజచేసి, పుట్టమట్టిని తీసుకుని వచ్చి అంకురార్పణను శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమాలకు ఉభయ కర్తలుగా దాట్ల సుదర్శన్‌రెడ్డి, గుడ్లదొన వరప్రసాద్, డబ్బుగుంట వెంకటేశ్వర్లు, అరికట్ల ఉమాచంద్ తదితరులు వ్యవహరించారు.

విధేయతకు పట్టం

- ఎమ్మెల్సీగా బీద రవిచంద్రకు అవకాశం
- మొదటి నుంచి టీడీపీలోనే..
- రాజకీయ చాణిక్యుడిగా గుర్తింపు
- ప్రతిపక్షంలోనూ సీమ ఇన్‌చార్జిగా కీలక బాధ్యతలు
- నేడు నామినేషన్ దాఖలు
- ఎన్నిక లాంఛనమే..

నెల్లూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కష్టపడ్డవారికి ఎప్పటికైనా గుర్తింపు ఉంటుందని టీడీపీ మరోసారి రుజువు చేసింది. నిబద్ధత, విధేయతకు మారుపేరైన బీద రవిచంద్రకు పార్టీ మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను టీడీపీ ఆదివారం ప్రకటించింది. అందులో బీదకు అవకాశమిచ్చారు. సోమవారం నామినేషన్ వేయనున్నారు.

రెండోసారి అవకాశం

ప్రస్తుతం కూటమికి మెజారిటీ ఎమ్మెల్యేలు ఉండడంతో బీద ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. రవిచంద్ర శాసనమండలికి ఎన్నిక కావడం ఇది రెండోసారి. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రవిచంద్రకు ఎమ్మెల్సీగా అవకాశమిచ్చారు. అప్పట్లో ఆయన జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. అయితే 2019లో అధికారం కోల్పోయాక రవిచంద్ర సేవలను రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ వినియోగించుకుంది. 1992 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న రవిచంద్ర.. అల్లూరు మండల తెలుగు యువత కార్యదర్శి నుంచి జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి అంచలంచెలుగా ఎదిగారు. గ్రామ స్థాయి రాజకీయాలు బాగా తెలిసిన ఆయన రాష్ట్ర స్థాయిలో టీడీపీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారు. రాజకీయ చాణిక్యుడిగా బీదకు


బీద రవిచంద్రకు ఎమ్మెల్సీ సీటు ప్రకటించడంతో ఆదివారం విజయవాడలోని ఓ హోటల్‌లో ఆయన్ను సన్మానించిన అభిమానులు

పేరుంది. గత ఐదేళ్ల ప్రతిపక్షంలో ఉన్న ప్పుడు రాయలసీమ ఇన్‌చార్జిగా వ్యవహరిం చారు. రాయలసీమలోని అన్ని జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి నియోజక వర్గంపై లోతుగా సమీక్షించడం, అక్కడ పరిస్థితు లను చక్కదిద్దడం లో సఫలీకృతు లయ్యారు. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపిక లోనూ కీలకంగా వ్యవ హరించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాయలసీమ జిల్లాల్లో అత్య ధిక సీట్లు టీడీపీ సాధించడంలో కీలకపాత్ర పోషించారు. ఒకదశలో కావలి నుంచి పోటీ చేయాలన్న ఆలోచన కూడా చేశారన్న ప్రచారముంది. అయితే అధినేత ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికే రవిచంద్ర మొగ్గు చూపారు. రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహించినా, జిల్లాలోని పరిస్థితులను తెరవెనుక నుంచి ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ వచ్చారు. వైసీపీ ప్రభుత్వం నీరు-చెట్టు బిల్లులను ఆపేసి టీడీపీ కార్యకర్తలను ఇబ్బం దులకు గురి చేసిన సమయంలో.. హైకోర్టు ద్వారా బిల్లులు తెచ్చుకోవ డంలో కీలకంగా వ్యవహరించారు.

పేరు : బీద రవిచంద్ర
తల్లిదండ్రులు : జయలక్ష్మి, రఘురామయ్య
జన్మస్థలం : ఇస్కపల్లి, అల్లూరు మండలం
విద్యార్హతలు : ఎం,కామ్,.

రాజకీయ నేపథ్యం : అల్లూరు మండల తెలుగు యువత కార్యదర్శిగా (1992-1993), జిల్లా తెలుగు యువత కార్యదర్శిగా (1993-95), అల్లూరు మండల పార్టీ అధ్యక్షుడిగా(1995-2000), అల్లూరు నియోజకవర్గం సమన్వయకర్తగా(1998-2000), జిల్లా ప్రధాన కార్యదర్శిగా (2000-2010), రాష్ట్ర పార్టీ సహాయక కార్యదర్శిగా (2007-2008), కడప జిల్లా ఇన్‌చార్జిగా(2008), తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా (2008-2014), జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా (2012-2020), ఎమ్మెల్సీగా (2017-2023) పనిచేశారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమవారం) : 6.23
సహరి (మంగళవారం) : 5.04

చారిత్రక ఘట్టం ఆవిష్కరణ

- నెల్లూరు రూరల్‌లో ఒకేరోజు 105 ప్రాంతాల్లో పనుల ప్రారంభం
- ప్రజలతో శంకుస్థాపన చేయించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి
- మంత్రి నారా లోకేష్ ప్రశంసలు

నెల్లూరురూరల్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం ఓ చారిత్రకఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎక్కడా జరగని విధంగా నూతన రాజకీయ అధ్యాయానికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. తన నియోజకవర్గంలోని 26 మున్సిపల్ డివిజన్ల పరిధిలోని 105 ప్రాంతాల్లో ఒకేరోజు రూ. 9.50 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులకు ఆయన ప్రజలతో శంకుస్థాపన చేయించారు. కొన్ని ప్రాంతాల్లో ఎమ్మెల్యే పాల్గొనగా, మరికొన్ని చోట్ల టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ప్రజల రుణం తీర్చుకునే అవకాశం

ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లా డుతూ తనకు రాజకీయ జన్మనిచ్చిన నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు ఇదో సదావ కాశమన్నారు. ఆదివారం జరిగిన 105 పనుల శంకు స్థాపనతో పాటు ఈనెల 14వ తేదీలోగా మరో 198 ప్రాంతాల్లో శంకుస్థాపనలు చేయనున్నట్లు వివరించారు. ఇందుకుగాను రూ. 40 కోట్లు ఖర్చు చేయనున్నామన్నారు. ఈ మొత్తం పనులను మే 20వ తేదీలోగా పూర్తి చేసి, కార్యకర్తలతోనే ప్రారంభోత్సవాలు చేయిస్తామని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరాక ఇప్పటి వరకు తన నియోజకవర్గంలోరూ. 191 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పొట్టేపాళెం, ములుముడి ప్రాంతాల్లోని కలుజులపై వంతె నలు, వెల్లంటిలో కల్యాణ మండపం పూర్తి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.

మంత్రి లోకేష్ ప్రశంసలు

నెల్లూరు రూరల్‌లో ఒకేరోజు 105 పనులకు శంకుస్థాపన చేయడంపై రాష్ట్ర ఐటీ శాఖమంత్రి నారా లోకేష్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇలాంటి వినూత్న కార్య క్రమం దేశ, రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇదే ప్రథమం అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు.


నగరంలోని ఆకుతోట హరిజనవాడలో సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

జయహో.. భారత్ !

- న్యూజిలాండ్‌పై థ్రిల్లింగ్ విక్టరీ
- సంబరాల్లో మునిగితేలిన యువత
- వీధుల్లో కేరింతలు.. స్వీట్లు పంపిణీ

నెల్లూరు(విద్య), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఐసీసీ చాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ గెలుపు అందరిలోనూ సంతోషం నిలిపింది. కెప్టెన్ రోహిత్ శర్మ బ్యాట్‌తో సత్తా చాటిన వేళ..బౌలర్లు ప్రత్యర్థిని 251 పరుగలకే కట్టడి చేసిన వేళ...భారత జట్టు మరో సారి ఐసీసీ ట్రోఫీని ఖాతాలో వేసుకుంది. ఆదివారం దుబాయ్ వేదికగా జరిగిన ఫైనల్స్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి భారత్ చాంపియన్‌గా అవతరించింది.

ఒకటే ఉత్కంఠ

జిల్లాలో క్రికెట్ ఫీవర్ కారణంగా యువత, ప్రజల్లో ఒకటే ఉత్కంఠ. దీంతో ఆదివారం అందరూ టీవీలకు అతుక్కుపోయారు. భారత్ క్రీడాకారుల విన్యాసాలు చూసేందుకు అంతా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. క్రీడాకారులు కొట్టే షాట్‌లు...తీసే ప్రతి వికెట్‌కు సహచర మిత్రులతో కలసి కేరింతలు కొడితేనే మాకు ఉత్సాహం అంటూ.. యువత మజా చేసుకున్నారు. ఈ మ్యాచ్‌ను సాదాసీదాగా ఎంజాయ్ చేస్తే థ్రిల్ ఏముందంటూ హోటల్ గదులను బుక్ చేసుకున్నారు. మరి కొందరు ముందుగానే రెస్టారెంట్‌లు, బార్‌లను బుక్ చేసుకున్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా జనరేటర్లు, ఇన్వర్టర్‌లను సైతం సిద్ధం చేసుకున్నారు. దీంతో ఆదివారం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. కొందరైతే రోడ్లపై టీవీ షోరూంల బయట



నిలబడి మరీ మ్యాచ్‌ను తిలకించారు. రోహిత్‌సేనకు అభినందనలు తెలుపుతూ జిల్లా ప్రజలంతా సంబరాల్లో మునిగిపో యారు. యువత బైక్‌లపై విన్యాసాలు చేస్తూ జయహో భారత్.. అంటూ నగర వీధుల్లో నినా దాలు చేస్తూ తిరిగారు. భారత్ మాతాకీ జై ... అంటూ స్వీట్లు పంచుకున్నారు. దీంతో నెల్లూరు నగర మంతా సందడిగా మారింది. ప్రజలు, పోలీసులు కూడా అభిమానుల ఆనందానికి అడ్డంకులు తెలప కుండా వారు కూడా ఆనందాన్ని ఆస్వాదించారు.

భారీగా బెట్టింగ్‌లు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)/లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): చాంపియన్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో భారత్-న్యూజీల్యాండ్ తలపడడంతో బెట్టింగ్ రాయుళ్లు యాప్‌ల్లో బాల్‌బాల్‌కు పందేలు కాశారు. రూ. వేల నుంచి రూ.లక్షల్లో పందేలు పెట్టారు. నెల్లూరు నగరంలో పందేల జోరు బాగా కనిపించింది. కాగా లింగసముద్రం మండలంలో కూడా క్రికెట్ బెట్టింగులు జోరుగా సాగాయి. ఇండియా గెలుస్తుందంటూ ఒకటికి రెండు వంతులు ఇచ్చేలాగున పందేలు కాశారు. అలాగే సిక్సర్లు, ఫోర్లపై కూడా పందేలు పెట్టారు. ఇటీవల లింగసముద్రం గ్రామానికి చెందిన ఓ యువకుడు క్రికెట్ బెట్టింగులో డబ్బులు పోగొట్టుకొని నెల్లూరులో ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిసింది.అలాగే మరో యువకుడు ఒక వ్యాపారికి చెందిన రూ.5 లక్షలు క్రికెట్ బెట్టింగులో పోగొట్టడంతో వారు ఆ యువకుడిని స్వంత ఊరికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు జరుగుతుండడంతో పోలీసులు కూడా ఏమీ చేయలేక పోతున్నారు.

న్యూస్ బాక్స్

ఫుడ్‌కోర్టు ప్రారంభం

ఉలవపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వైఎస్ రాజశేఖర్ విగ్రహం వెనుక నూతనంగా ఏర్పాటు చేసిన ఫుడ్‌కోర్టు, టీ స్టాల్‌ను ఆదివారం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌కే ఏజెస్ ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, సారాయిబాబు, కరీం, ఖాదర్‌బాషా, దాసరి వెంకట్రావు, ఎంపీటీసీ యలమంద మ్మ, బెల్లం కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దాతృత్వం

కావలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మనుబోలు వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్లుతున్న ఒక వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లింది. ఈ సమయంలో కావలి నుంచి రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు కారులో వెళుతున్న ఎమ్మెల్యేకు ఆయన్ను చూసి వెంటనే స్పందించాడు. వాహనం నిలిపి అపస్మారక స్థితిలో ఉన్న ఆయనకు సపర్యలు చేసి 108 వాహనంకు ఫోన్ చేయించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే మానవత్వంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

హిందూ ధర్మాన్ని ఆచరిద్దాం

కలిగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరస్వామి రచించిన వంద ఆధ్యాత్మిక రచనలను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి దుత్తలూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో పంపిణీ చేశారు. హిందూ ధర్మాన్ని పాటిస్తూ ప్రతి పండుగ విశిష్టతను తెలుసుకొని నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రసాద్,వెంకటేశ్వర్లు, సుధాకర్, పెంచలరత్నం, నరసింహులు, మహేంద్ర, ఓబులమ్మ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కోలుకోలేక వ్యక్తి మృతి

అల్లూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ కోలుకోలేక మృతిచెందిన సంఘటన పట్టణ పరిధిలోని గాంధీకాలనీలో చోటు చేసుకుంది. ఈ నెల 2న అల్లూరు నుండి ద్విచక్ర వాహనంపై చల్లా శంకరయ్య (50), మల్లి హరీష్, బెల్లంకొండ నరేష్‌లతో కలసి దగదర్తి మండలం ఉలవపాళ్ళకు వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి అల్లూరు సింగపేట మధ్యలో తాటిచెట్టుకు ఢీకొన్నారు. చికిత్స నిమిత్తం ముగ్గురికి నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శంకరయ్య మృతిచెందాడు. గాయపడిన యువకులు కోలుకుంటున్నారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సంగం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పీఎంఏవై 2.0 పథకం కింద పక్కాగృహాలకు దరఖాస్తు చేసుకునేందుకు సోమవారంతో గడువు ముగుస్తుందని హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇంతవరకు 1034 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గీయులు కుల, ఆదాయ, పొజిషన్ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ వర్గీయులు ఆదాయ, పొజిషన్ పత్రాలతో సోమవారం మధ్యాహ్నానికి స్థానిక కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

● సీతారామపురం: పక్కాగృహాల కోసం మండలంలోని 14 పంచాయతీల పరిధిలోని 803 మంది దరఖాస్తు చేసుకున్నారని హౌసింగ్ ఏఈ కరిముల్లా తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పొజిషన్ పత్రం, ఓసిలైతే ఆదాయ ధ్రువీకరణ, పొజిషన్ పత్రాలు మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం లోపు అందించాలని ఆదివారం హౌసింగ్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 11 ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంఈవో షేక్ మస్తాన్‌వలి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20వ తేదీన నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధికి బాటలు



ట్రై సైకిళ్లు అందిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గుడ్లూరు మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలోని హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం నియోజకవర్గస్థాయి తెలుగుదేశం, జన సేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయసమావేశంలో ఆయన పాల్గొన్నారు. మొదటగా 147మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకార్యక్రమంలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే కందుకూరు అభివృద్ధికి రూ.50కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. అర్హతున్న వారికి ట్రై సైకిళ్ల అందకుంటే రెండోవిడతలో పంపిణీ చేస్తామన్నారు. అనంతరం కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. వీపీఆర్ ట్రస్టు అన్నివర్గాల వారికి చేయూత ఇవ్వడం హర్షణీయం అన్నారు.

కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, మండల అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వేముల గోపాల్‌రావు, మాదాల లక్ష్మినరసింహం, దామా మల్లేశ్వరరావు, రాచగల్లు సుబ్బారావు, గ్రామపార్టీ అధ్యక్షులు పువ్వాడి శ్రీనివాసులు, సర్పంచ్ పాలకీర్తి శంకర్, ఎంపిటీసీ సభ్యురాలు చెన్నారెడ్డి వరమ్మ, పార్టీ నాయకులు పువ్వాడి వేణుగోపాల్, రావూరి వేణు, రాఘవులు, పిడికిటి వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీరెడ్డి, పార్టీ కందుకూరు కన్వీనర్ హరిబాబు, జనసేన నాయకులు కొనిదెల శ్రీనివాసులు, అంగులూరి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

బుడంగుంటకాలనీలో బాలిక అపహరణకు యత్నం

● అవ్వతో ఇంటికి వెళుతుండగా ఘటన ● కేకలు వేయడంతో మేలుకున్న స్థానికులు ● బైక్‌తో వెంబటించడంతో దుండగుల పరారీ

కావలి రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడంగుంటకాలనీలో బాలిక కిడ్నాప్‌కు శనివారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు యత్నించారని బాలిక అమ్మమ్మ కుంచాల మంగమ్మ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రూరల్ పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. కాలనీలో నివసించే మంగమ్మ అదేకాలనీలోని పక్కవీధిలో ఉంటున్న కుమార్తె నాగమణి ఇంటికి వెళ్లింది. మనవడు, 6ఏళ్ల మనవరాలు కలిసి మంగమ్మ ఇంటికి వస్తుండగా మాస్కులు ధరించిన ఇద్దరు వ్యక్తులు మోటారు బైక్‌పై వచ్చి మంగమ్మను ప్రక్కకు నెట్టి మనవరాలిని బైకుపై ఎక్కించుకుని వెళ్లారు. మంగమ్మ పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు గుర్తించి వారిని మోటారు సైకిళ్లపై వెంబడించారు. దీంతో ఆ వ్యక్తులు మోటారు బైకుతో పాటు బాలికను అక్కడే వదిలి పరారీ అయ్యారు. ఈ ఘటనలో చేతికి స్వల్పగాయమైన బాలికను ఏరియా ఆస్పత్రికి తరలించారు. రూరల్ సీఐ రాజేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేకాలనీలో ఉంటున్న నరేంద్ర, హజరత్‌లకు మాకు పాత గొడవలు ఉన్నాయని బాలిక అమ్మమ్మ మంగమ్మ వారిపై అనుమానం వ్యక్తం చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బిహార్ యువకుడి మృతి



మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలిస్తున్న పోలీసులు

ఉలవపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):స్థానిక జాతీయ రహదారిలోని రాజుపాలెం మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం బిహార్‌కు చెందిన యువకుడు ప్రశాంత్(25) మృతి చెందాడు. ఎస్ఐ అంకమ్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చాగొల్లు గ్రామానికి చెందిన వల్లూరు కిశోర్ తన వ్యవసాయ పొలంలో పశువుల ఫారంలో మరో నలుగురితో కలిసి ప్రశాంత్ పని చేస్తున్నాడు. ఈయన చెప్పులు తెచ్చుకుంటానని ద్విచక్ర వాహనంపై ఉలవపాడుకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో వెనుక వైపు నుంచి వచ్చిన లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ లారీని ఆపకుండా మోచర్ల వద్దకు వెళ్లి లారీని నిలిపి పరారీ అయ్యాడు. పోలీసులకు లారీలో దొరికిన ఫోన్ నెంబర్ల ఆధారాలతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

● భర్త వేధింపుతోనే అని తల్లి ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), మార్చి 9(ఆంధ్రజ్యోతి): పొర్లుకట్ట ప్రాంతంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల సమాచారం మేరకు.. కందుకూరు షేక్ నమీ నా(37)కు పొర్లుకట్టకు చెందిన మున్వర్‌తో కొన్నేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి మహిరా, అక్బర్ సంతానం. మున్వర్ 2016లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటినుంచి నమీనా నగరంలోని ఓ జెరాక్స్ షాప్‌లో పనిచేస్తూ పిల్లలను పోషిస్తోంది. పొర్లుకట్టలోనే నివాసమున్న మున్నా భార్య నుంచి విడిపోయాడు. ఈ క్రమంలో నమీనాకు మున్నాతో పరిచయమైంది. పిల్లల్ని బాగా చూసుకుంటానని చెప్పడంతో ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలిపింది. వారి అంగీకరించడంతో 2017లో వివాహం చేసుకున్నారు. కొద్దిరోజులు బాగానే ఉన్నా పిల్లల విషయంలో వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఇదిలా ఉండగా నమీనా పొదుపులో రూ.4లక్షల రుణం తీసుకుని భర్తకు ఇచ్చింది. రుణం చెల్లింపులో ఈ నెల 8వ తేదీ వారి మధ్య గొడవ జరిగింది. ఆ తర్వాత మున్నా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆదివారం తెల్లవారుజామున మున్నా తన భార్యకు వీడియో కాల్ చేసి మాట్లాడాడు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో తెలియదుగానీ నమీనా ఇంట్లోనే చీరతో ఉరివేసుకుంది. గమనించిన కుమారుడు పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకొని నమీనాను రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నమీనా తల్లి బీబీజాన్ ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నమీనా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

శిథిలావస్థలో ఇరిగేషన్ అతిథి భవనం

● భయాందోళనలో సిబ్బంది



శిథిలావస్థలో ఉన్న ఇరిగేషన్ అతిథి భవనం

సంగం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయానికి ఎదురుగా సంగం - నెల్లూరు రహదారి పక్కనే ఉన్న ఇరిగేషన్ అతిథి భవనం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఈ భవనాన్ని 1882లో బ్రిటీష్ అధికారులు నిర్మించారు. సంగం వద్ద పెన్నానదిలో బ్యారేజి నిర్మాణ సమయంలో అధికారులతోపాటు, ఇంజనీరింగ్ అధికారుల విశ్రాంతి కోసం దీన్ని నిర్మించారు. చరిత్రకు చిహ్నంగా నిలిచిన ఈ భవనం పెంకులు దెబ్బతిన్నాయి. దీంతో పైకప్పు ఊడి కింద పడింది. సిబ్బంది తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. దీంతో ఈ భవనం ఎప్పుడు కూలుతుందోనని కాపలా ఉన్న సిబ్బంది భయపడుతున్నారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు

చరిత్రకు చిహ్నంగా ఉన్న ఈ భవనాన్ని రూపు కోల్పోకుండా మరమ్మతులు చేసేందుకు స్థానిక అధికారులు గతంలో ప్రతిపాదనలు పంపారు. వైసీపీ ప్రభుత్వం భవనం గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. నిధులు మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా పాలకులు, అధికారులు స్పందించి నిధులు మంజూరుచేసి చరిత్రకు చిహ్నంగా ఉన్న పురాతన భవనానికి మరమ్మతు పనులు చేయాలని పలువురు కోరుతున్నారు.

సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు : జడ్పీటీసీ



సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఏఈని వివరాలు అడుగుతున్న జడ్పీటీసీ అనిల్‌కుమార్‌రెడ్డి

కలువాయి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు జడ్పీటీసీ బి అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి కీలక శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. దీంతో అధికారుల తీరుపై జడ్పీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీల ప్రశ్నలకు ఎవరు సమాధానం ఇస్తారని ఆయన అన్నారు. ఇకపై గ్రామస్థాయిలో జరిగే ప్రతి అభివృద్ధి పని వివరాలు స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారులు తెలియజేయాలని కోరారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను కోరారు. అసంపూర్తిగా ఉన్న సచివాలయాలు, హెల్త్ సెంటర్ల భవనాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం వివరాలు కోరినట్లు పంచాయతీరాజ్ ఏఈ జయరామిరెడ్డి సభకు తెలిపారు. కులూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు లోడ్ తక్కువగా ఉందని, బ్రాహ్మణపల్లి, పెన్నబద్వేలి గ్రామాలను కూడా దీనిలో కలపాలని సమావేశంలో ప్రజాప్రతినిధులు విద్యుత్‌శాఖ అధికారులను కోరారు. దీంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని విద్యుత్‌శాఖ ఏఈ తెలిపారు. మండలంలో 12 పాఠశాలలను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపినట్లు ఎంఈవో శేషగిరిరావు తెలిపారు. తెలుగురాయపురం నుంచి కలువాయి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్లు, వెంకటరెడ్డిపల్లి వద్ద పైపు కల్వర్టు, సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.75లక్షలతో అంచనాలు పంపామని, మార్చి నెలాఖరు నాటికి మంజూరు వస్తుందని ఆర్‌అండ్‌బీ ఏఈ అన్వేష్ తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పంగా పెంచలనరసారెడ్డి, ఎంపీడీవో ఎం.భవాని, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

చలో పిఠాపురం పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

సంగం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన నాయకులు ఆదివారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకుని చలో పిఠాపురం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 14వ తేదీన పిఠాపురంలోని చిత్రాడ గ్రామంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి తరలిరావాలని పిలుపునిస్తూ పోస్టర్‌లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు భానుకిరణ్, మండల ప్రధాన కార్యదర్శి దంతాల హజరత్, మండల ఉపాధ్యక్షుడు రవిచంద్ర, రాజా, కార్యకర్తలు, పవన్ కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత



బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేస్తున్న మంత్రి ఆనం

మర్రిపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న ప్రతీ కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్రిపాడు మండలానికి చెందిన 8మందికి రూ. 14,54,785 ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపి అధ్యక్షుడు ఆరికట్ల జనార్ధన్‌నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

సంగం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఐదవ తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు మండలంలోని సుమారు 45 పాఠశాలల నుంచి 230 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీపీఎం ప్రజా చైతన్య యాత్రల ప్రారంభం

కావలి టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలన్నీ అమలు చేయాలని సీపీఎం కార్యదర్శి వర్గసభ్యులు మాదాల వెంకటేశ్వర్లు డిమాండు చేశారు. సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య అధ్యక్షతన ఆదివారం స్థానిక కసాయి వీధిలో సీపీఎం ప్రజా చైతన్యయాత్రను మాదాల ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8నెలలైనా ఎన్నికల ప్రధాన హామీలు అమచేయకపోవడం దుర్మార్గమన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో పేదలను దోచుకోవడం, పెట్రోల్ డీజిల్, నిత్యావసరాలు ధరలు నియంత్రించలేక పోవడం మంచి ప్రభుత్వమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్ వెంకయ్య, కృష్ణయ్య, మధుసూదన్‌రావు, మస్తాన్, బాబురావు పాల్గొన్నారు.

వైసీపీ పూర్వవైభవానికి కృషి చేద్దాం..

వలేటివారిపాలెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పార్టీకి పూర్వ వైభవం తీసుకవచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేద్దాం అని పార్టీ మండల కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసింహం కోరారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం 13విభాగాలకు చెందిన నూతన మండల కమిటీల ఎన్నిక జరిగింది. అనంతరం లక్ష్మీనరసింహంనకు కార్యకర్తలు, నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు చింతలపూడి రవీంద్ర, కాకు వెంకటస్వామి, నల్లమోతు చంద్రమౌళి, నాగిరెడ్డి శివరామిరెడ్డి, ఇరపని అంజయ్య, గుత్తా గోపి పాల్గొన్నారు.

● లింగసముద్రం (ఆంధ్రజ్యోతి): వైసీపీ పటిష్టతకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక పార్టీ కార్యాలయంలో వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన 20మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే యూత్ విభాగం, వాలంటరీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ, క్రిష్టియన్ ఇలా మరో 15కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, తిరుపతిరెడ్డి, షేక్ షఫి, చీమల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వేణు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడలేదని ప్రమాణం చేసే దమ్ముందా?

కావలి టౌన్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని శివాలయం, పోలేరమ్మ అరుగు వద్ద ప్రమాణం చేసే దమ్ముందా? అని మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం తుమ్మల పెంట రోడ్డువద్ద నున్న తన కార్యాయలంలో అనుచరులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం మాజీ ఎమ్మెల్యే కుట్రే అన్నారు. షోకాజ్ నోటీస్ ఇవ్వకుండా సస్పెండ్ చేయడం ఎక్కడా లేదన్నారు. 2019 ఎన్నికల్లో బెంగళూరు నుంచి చీప్ లిక్కర్ అక్రమంగా తెచ్చి ఓటర్లకు పంచి అనేకమంది ప్రాణాలు పోయేందుకు కారణం అయినట్లు తెలిపారు. ఆయా మండలాల్లోని ప్రాంతాల్లో ఎవరి వద్ద డంప్ చేశారో తన వద్ద సాక్ష్యాలు ఉన్నాయని ఆ కేసును తానపై వేసుకుని జైల్‌కు పోయిన విషయాన్ని గుర్తు చేశారు. తాను చేసిన ఆరోపణలకు సాక్ష్యాలున్నాయని ప్రతాప్‌కుమార్ రెడ్డి దమ్ముంటే బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండారా అని ప్రశ్నించారు.

రైతు సంఘం నాయకులను అరెస్ట్ చేసి, నోటీసులు

కావలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ రైతు, వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో గుంటూరులో తలపెట్టిన మహాధర్నాకు అనుమతులు లేదంటూ కావలి టూటౌన్ పోలీస్‌లు ఆదివారం రైతు సంఘం నాయకులకు నోటీస్‌లు అందజేశారు. అనంతరం రైతుసంఘం జిల్లానాయకుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దమ్ము దర్గాబాబులను అదుపులోకి తీసుకున్నారు. అక్రమ అరెస్టులు రైతాంగ ఉద్యమాలను ఆపలేవన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, అర్హతకలిగిన రైతులకు రుణాలు మంజూరు చేయాలని, రైతులకు రుణమాఫీ చేసి కేరళ తరహా రుణవిమోజన చట్టాన్ని తీసుకు రావాలని వారు కోరారు. 60 సంవత్సరాలు నిండిన రైతులు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు.

పునరాలోచన చేయాలి

కందుకూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానం సరైనది కాదని, ఈ విషయంపై పునరాలోచన చేయాలని మాలమహానాడు డివిజన్ అధ్యక్షుడు లింగాబత్తిన బ్రహ్మయ్య అన్నారు. పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఆదివారం మాల మహానాడు, మాల ఉద్యోగుల సంఘం ఆత్మీయ సమావేశం సూర్యం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బ్రహ్మయ్య పాల్గొని పట్టణ నూతన కమిటీని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొట్లగుంట శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడుగా చెక్క సింగయ్య, బందెల మాల్యాద్రి ఉన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ మాలకొండయ్య, పాలేటి కోటేశ్వరరావు, కట్టా రమేష్, సింగయ్య, నల్లపు చంద్రశేఖర్, ధర్మయ్య పాల్గొన్నారు.

వాహన చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

● ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి



ఉదయగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు మోటార్ వాహన చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఉదయగిరి ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. మార్చి 1వ తేదీ నుంచి నూతన మోటార్ వాహనం చట్టం అమల్లోకి వచ్చింది. నిబంధనలు పాటించని వాహనదారులకు రెట్టింపు అపరాధ రుసుం విధించనున్నట్లు తెలిపారు.

? ప్రమాదాల నివారణకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు.

! ప్రమాదాల నివారణకు వాహనదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వేగనిరోధకాలు ఏర్పాటు చేస్తున్నాం.

? మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు చేపడుతున్నారా.

! ప్రతిరోజు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి అపరాధ రుసుం విధించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచిస్తూ కౌన్సిలింగ్ ఇస్తున్నాం.

? ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారా.

! ఉదయగిరి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. ప్రధాన కూడళ్లలో పోలీసు సిబ్బందిని ఏర్పాటుచేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూస్తున్నాం. ఆటోలు, సరుకు దిగుమతి చేసే వాహనాలు రహదారులపై నిలపకుండా చూస్తున్నాం.

ఉదయగిరి అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే కాకర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయం అని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. మండలంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 9నెలల కాలంలో సుమారు రూ. 150 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఆరోపణలు మాని అభివృద్ధికి సహకరించాలని కోరారు. తాగునీటి సమస్య అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో 8 మండలాల టీడీపీ కన్వీనర్లు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉదయగిరిని జిల్లా చేయాలని ఉద్యమం

● జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

ఉదయగిరి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేసేందుకు పరిశీలన చేస్తున్నామని రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అసెంబ్లీలో ప్రకటించడం జిల్లా సాధన ఉద్యమానికి ఊపిరినిచ్చిందని సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కె వేణుగోపాల్ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఐటీఐ కళాశాలలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరిని జిల్లా చేయాలని తాము చేసిన ఉద్యమ ఫలితంగా ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేసేందుకు ప్రభుత్వం పరిశీలన చేస్తుండడం హర్షణీయమని, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపామన్నారు. ఉదయగిరిని జిల్లా చేయాలని అసెంబ్లీలో గళాన్ని వినిపించాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఉదయగిరిని జిల్లా చేయాలనే ఉద్యమాన్ని ఇకనుంచి ఉధృతం చేస్తామని, పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు, శ్రామికులు, కర్షకులు, యువత, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు షేక్ దస్తగిరి అహ్మద్, షేక్ ఖాదర్‌బాషా, గాజులపల్లి రామిరెడ్డి. ఏడుకొండలు, ఖాదర్‌బాషా, ఫణిరాజ్ పాల్గొన్నారు.

ధ్యానంతో అన్ని సమస్యలు దూరం

వింజమూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో అన్ని సమస్యలు దూరమవుతాయని హైదరాబాద్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఓం ప్రకాష్ అన్నారు. ఆదివారం ఆత్మజ్ఞానంలో భాగంగా శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో ఆయన మాట్లాడారు. అనంతరం శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు.